# వార్త

ఆదివారం

9 జులై, 2023



# అమ్మకు 'బోనం'



# 'రాయల్'గా ప్రభాస్!

ప్రస్తుతం ప్రభాస్ చేతిలో నాలుగు సినిమాలు ఉన్నాయి. వాటిలో మారుతి దర్శకత్వంలో రూపొందుతున్న సినిమా ఒకటి. ఇప్పటికే ఈ సినిమా షూటింగు అరవై శాతం పూర్తయినట్లు తెలుస్తోంది. పీపుల్స్ మీడియావారు ఈ సినిమాను నిర్మిస్తున్నారు. ఇది ఒక సినిమా థియేటర్ నేపథ్యంలో నడిచే కథ అనీ, 'రాజా డీలక్స్' అనే పేరు ఖాయమైనట్లు ఆ మధ్య వినిపించింది. కానీ ఇప్పుడు ఆ టైటిల్‌ను 'రాయల్'గా మార్చినట్లు సమాచారం. ఇందులో ప్రభాస్ జోడీగా నిధి అగర్వాల్, మాళవిక మోహనన్, రిధి కనిపించనున్నారు. ఈ సినిమాలో ఒక గెస్ట్ రోల్‌లో రామ్ గోపాల్ వర్మ కనిపించనున్నట్లు తాజా సమాచారం.

# బాలయ్య జోడీగా నయనతార?



బాలయ్య తన 108వ సినిమాను అనిల్ రావిపూడి దర్శకత్వంలో చేస్తున్నారు. 'భగవంత్ కేసరి' టైటిల్‌తో ఈ చిత్రం దసరాకి ప్రేక్షకుల ముందుకు రానుంది. ఆ తరువాత సినిమాను బాబీ దర్శకత్వంలో చేయడానికి బాలయ్య అంగీకరించారు. అందుకు సంబంధించిన సన్నాహాలు జరుగుతున్నట్లు తాజా సమాచారం. ఈ చిత్రంలో ఇద్దరు కథానాయికలుంటారనీ, అందులో ఒక కథానాయికగా నయనతారను తీసుకున్నట్లు తెలుస్తోంది. 'సింహా', 'శ్రీరామరాజ్యం', 'జై సింహా' తరువాత ఈ ఇద్దరి కాంబినేషన్‌లో రాబోతున్న సినిమా ఇది. మరో కథానాయిక పాత్ర కోసం రకుల్, సంయుక్తమీనన్ పేర్లను పరిశీలిస్తున్నట్లు వినికిడి.

తారాతీరం

ఆదివారం వార్త

9 జులై, 2023

## మంచి ముత్యాలు

భూమికి సూర్యుడు ఎంత అవసరమో,
జీవితానికి ప్రేమ అంత అవసరం.

\- టాల్‌స్టాయ్

## విషయ విశేషం

ఇదంతా ఒకే ఊరు.... 4

'సంఘీ'భావం....5
తెలుగులో తీర్పు అభినందనీయం

కవర్ స్టోరీ..6
అమ్మకు 'బోనం'

తరం మారుతోంది..10

ఈవారం కవిత్వం..12
వానాకాలం వచ్చింది

మనసు దోచే విడిది.....14

కథ.. 20
కళ్లు తెరచుకున్నాయి

సాహిత్యం..24
తెలుగు కథ, నవలా చక్రవర్తి 'త్రిపురనేని గోపీచంద్'

యుగపురుషుడు 'నారాయణగురు'...26

బిత్తరపోయిన యం.డి....30

ఇంకా..
పుస్తక సమీక్ష
మొగ్గ
వారఫలం
వగైరా..వగైరా..

# తాజా వార్తలు

## పన్ను కట్టిన వారికి ఉచితం



మహారాష్ట్రలోని ఓ చిన్న కుగ్రామం మానసవలి. పన్నెండు వందల మంది జనాభా ఉన్న ఆ గ్రామ పంచాయితీకి ఓ సమస్య వచ్చి పడింది. దాదాపు పదేళ్లుగా గ్రామపెద్దలూ, అధికారులూ ఆ సమస్య పరిష్కారం కోసం సతమతమయ్యారు. చివరికి ఓ ఇల్లాలికొచ్చిన ఆలోచనతో పరిష్కారమార్గాన్ని కనిపెట్టారు అధికారులు. అసలు విషయం ఏంటంటే..పదేళ్లుగా ఆ గ్రామస్తులు ఇంటి పన్ను కట్టడం మానేశారు. పంచాయితీ సిబ్బంది వెళ్లి అడిగినా, రేపూ, మాపూ అంటూ తిప్పుతున్నారు. దాంతో నిధుల్లేక గ్రామాభివృద్ధి కుంటు పడుతూ వచ్చింది. పైగా అన్నేళ్లలో రాబట్టాల్సిన పనులు లక్షలకు చేరుకున్నాయి. దాంతో అధికారులు ఆ గ్రామంలో సమస్యలు తెలుసుకునే క్రమంలో ఓ విషయం వారి దృష్టికొచ్చింది. అక్కడ గోధుమలు, చిరుధాన్యాలు ఎక్కువ వాడతారు. కానీ ఆ చుట్టు పక్కల పిండిమిల్లు లేకపోవడంతో మగవాళ్లు దూరప్రాంతాలకు వెళ్లి మరి పిండి పట్టించుకుని వస్తారట. ఈ క్రమంలో ఒక ఇల్లాలు 'మేం పిండికోసం ఇలా ఇబ్బంది పడుతున్నాం. ఓ మిల్లు ఏర్పాటు చేసి, ఇంటి పన్ను కట్టిన వాళ్లకే పిండి పట్టించి ఇవ్వండి' అని కోరింది. దాంతో అధికారులు పంచాయితీ కార్యాలయంలో పిండి మిల్లు ఏర్పాటు చేసి పన్ను కట్టిన వారికి ఉచితం అంటూ బోర్డు పెట్టారు. అప్పటిదాకా పన్నులు కట్టకుండా భీష్మించుకున్న వాళ్లంతా ఆ పని పూర్తి చేసి పిండికోసం క్యూలో నిల్చుంటున్నారు.

వరుడు: పెళ్లి సంబంధం కుదిర్తే తల నీలాలిస్తానని మొక్కుకున్నావా? ఆహా! ఈ మొదటి రాత్రి ఎంత కళకళలాడిపోతున్నావో! కోపంతో ఊగిపోయాడు కొత్తపెళ్లికొడుకు..
వధువు: థాంక్స్ అండీ! నేను గుండులో ఉన్నా అందంగా ఉంటానండి...అమాయకంగా చెప్పిన కొత్తపెళ్లికూతురు!

...

భార్య: వంట పని చేస్తున్న భర్తవైపు చూస్తూ.. మనం పైకి పోయాక స్వర్గంలో కూడా ఇలా భార్యాభర్తలుగానే ఉంటాం కదండీ!
భర్త: అప్పుడది స్వర్గమెందుకవుతుందే పిచ్చిదానా!

మీ రచనల్ని ఈ మెయిల్ చిరునామాకు పంపగలరు. sunmagvaartha@gmail.com

# ఇదంతా ఒకే ఊరు





ఊరన్నాక ఊరిలో కొన్ని వీధులు, ఆ వీధుల్లో సందుగొందులు, ఆ సందుగొందుల్లో ఇళ్లూ వాకిళ్లు, గుళ్లూ గోపురాలు వంటివి ఉంటాయి. ఆ ఊళ్లో మాత్రం ఉండేది ఒకే ఒక్క పొడవాటి వీధి. ఆ ఒక్క వీధిలోనే ఊళ్లోని దాదాపు ఆరువేల జనాభా నివాసం ఉంటుంది. ఈ విచిత్ర మైన ఊరు పేరు సులోస్జోవా. పోలండ్ దక్షిణ ప్రాంతంలో ఉన్న ఈ ఊరు యూరప్‌లోనే అత్యంత విచిత్రమైన ఊరుగా పేరుపొందింది. ఈ ఊరి ఆకారాన్ని బట్టి దీనిని యూరోపియన్లు లిటిల్ టస్కనీ అని పిలుచుకుంటారు. ఈ వీధికి రెండువైపులా విశాలమైన పచ్చిక బయళ్లు కనువిందు చేస్తాయి. వీధిలో ఉన్న ప్రతి ఇంటికి వెనుకవైపు పచ్చని పెరటి తోటలు ఉంటాయి. హెలికాప్టర్‌లో నో, విమానంలోనో పోతూ ఈ ఊరిని చూస్తే ఆకుపచ్చని దృశ్యం అద్భుతంగా కనిపిస్తుంది.

# 24 కళ్లు గల జీవి



హాంకాంగ్‌లోని ఒక చెరువులో బయటపడింది ఈ వింతజీవి. జెల్లీఫిష్ జాతికి చెందిన ఈ జీవికి ఏకంగా ఇరవైనాలుగు కళ్లు ఉన్నట్లు శాస్త్రవేత్తలు గుర్తించారు. ఒక అంగుళం పరిమాణంలో పారదర్శకమైన శరీరం, మూడు పొడవాటి టెంటకల్స్ కలిగి ఉన్న ఈ జీవిని హాంకాంగ్‌లోని మైపో రిజర్వ్ చెరువులో గుర్తించారు. గంట మాదిరిగా కనిపించే దీని శరీరం లోపలి వైపు ఆరుభాగాల్లో పన్నెండు జతల కళ్లు ఉన్నాయని, ఆస్ట్రేలియన్ బాక్స్ జెల్లీఫిష్ మాదిరిగానే ఇది కూడా విషపూరిత మైనదని శాస్త్రవేత్తలు వివరించారు. హాంకాంగ్ బాప్టిస్ట్ యూనివర్సిటీ శాస్త్రవేత్తలు ఈ వింత జెల్లీఫిష్‌ను మూడేళ్ల కిందటే గుర్తించారు. దీనిపై విస్తృతంగా పరిశోధనలు జరిపి, ఈ విశేషాలను మీడియాకు తెలిపారు.

# ఆస్ట్రేలియా తీరంలో వింతచేప





ఆస్ట్రేలియాలోని విక్టోరియా నైరుతి తీరానికి భారీ పరిమాణంలోని వింత చేప ఒకటి కొట్టుకు వచ్చింది. దీనిని కేత్ రాంప్టన్, టామ్ రాంప్టన్ అనే దంపతులు తొలుత గుర్తించారు. చేప దాదాపు రెండు మీటర్ల పొడువు ఉంది. వీరిద్దరూ వెటర్నరీ డాక్టర్లే అయినా, ఇదివరకు ఎప్పుడూ ఇలాంటి చేపను వారు చూసి ఉండలేదు. ఒడ్డుకు కొట్టుకొచ్చిన చేప అప్పటికే మరణించి ఉంది. రాంప్టన్ దంపతులు ఈ చేప ఫొటో తీసి సోషల్ మీడియాలో పోస్ట్ చేయడంతోపాటు దీని గురించి కొంత అధ్యయనం చేయడంతో ఆసక్తికరమైన విశేషాలు బయటపడ్డాయి. ఇది 'ఓషన్ సన్‌ఫిష్' అని తేలింది. 'ఓషన్ సన్‌ఫిష్' జాతికి చెందిన చేపలు సైజులో భారీవే అయినా, సముద్రాల్లో వీటి సంఖ్య చాలా తక్కువ. అరుదైన చేపలు కావడంతో వీటి గురించి చాలామందికి తెలియదు. ఇవి పర్తిగా ఎదిగితే, నాలుగు మీటర్ల పొడవు, రెండున్నర మీటర్ల వెడల్పు వరకు పెరుగుతాయని, దాదాపు రెండున్నర వేల కిలోల బరువు ఉంటాయని మెరైన్ బయాలజిస్టులు చెబుతున్నారు. ఇవి ఉష్ణమండల తీరాల వద్ద అప్పుడప్పుడు కనిపిస్తుంటాయని వారు అంటున్నారు.

# సౌర పడవ



మామూలు మరపడవలు నడవాలంటే పెట్రోలు లేదా డీజిల్ కావాల్సిందే. వీటి నుంచి వెలువడే కర్బన ఉద్గారాల వల్ల సముద్రాలకు, నదులకు కాలుష్యం తప్పదు. ఈ సమస్యను అధిగమించాలనే ఉద్దేశంతో మారిషస్‌కు చెందిన లాభాపేక్ష లేని స్వచ్ఛంద సంస్థ 'సొసైటీ ఫర్ ది ప్రమోషన్ ఆఫ్ ఎంటర్‌ప్రైజెస్' (ఎస్‌పీఈఎస్) పూర్తిగా సౌరశక్తితో నడిచే పడవను రూపొందించింది. 'ఫోక్‌లరిక్ ఎక్స్‌ప్లోరర్' పేరుతో తయారు చేసిన ఈ పడవ పైకప్పు మీద 48 సౌరఫలకాల నుంచి వెలువడే విద్యుత్తును ఈ పడవలోని ఆరు లిథియం అయాన్ బ్యాటరీలు నిల్వచేసుకుంటాయి. బ్యాటరీలు పూర్తిగా చార్జ్ అయితే, ఈ పడవ ఏకధాటిగా 25 కిలోమీటర్లు ప్రయాణించగలరు. ఈ పడవ గంటకు 5 కిలోమీటర్ల వేగంతో ప్రయాణిస్తుంది.

# 'సంఘీ' భావం



## తెలుగులో తీర్పు అభినందనీయం

హైకోర్టు ఒక కేసులో తీర్పును తెలుగులో వెలువరించింది. స్థానిక భాషలకు ప్రాధాన్యత ఇవ్వాలని ఎప్పటినుంచో డిమాండ్ ఉంది. దీనికి అనుగుణంగా కొన్ని చట్టాలను కూడా చేశారు. జాతీయ స్థాయి పరీక్షలలో సైతం స్థానిక భాషకు ప్రాధాన్యతను కల్పించారు. చాలా రాష్ట్రాల్లో స్థానిక భాషను ప్రథమ భాషగా తీసుకుని ఉత్తీర్ణత సాధించిన వారికి ఉద్యోగాల్లో కొంత శాతం మార్కులను అదనంగా కలిపి ప్రోత్సహిస్తున్నారు. బ్రిటీష్ పాలనకు ముందు స్థానిక భాషలే అమలులో ఉండేవి. ముఖ్యంగా ఉర్దూ, పార్శీ భాషలకు కూడా గుర్తింపు ఉండేది. బ్రిటీష్ వారు మన దేశాన్ని పాలించడం ప్రారంభించినప్పటి నుంచి అన్ని చట్టాలు, ప్రభుత్వ ఆదేశాలు అన్నీ ఆంగ్లంలో రావడం ప్రారంభమైంది. బ్రిటీష్ పాలన ముగిసిన 15 సంవత్సరాల వరకు ఏమాత్రం మార్పులుచేర్పులు లేకుండా అదే విధానాన్ని కొనసాగించారు. ఆ తరువాత స్థానిక భాషను అమలుచేయాలన్న డిమాండ్ క్రమంగా పెరుగుతూ వచ్చింది. ఆర్టికల్ 143 ప్రకారం హిందీ అధికార భాషగా ఉంది. అయితే ఆర్టికల్ 348(ఎ) ప్రకారం పార్లమెంటు చట్టం ద్వారా భాషను నిర్ధారించే వరకు సుప్రీంకోర్టు, హైకోర్టులో అన్ని ప్రక్రియలు ఆంగ్లంలో జరుగుతాయి. ఆర్టికల్ (2) ప్రకారం రాష్ట్రపతి ముందస్తు అనుమతితో హిందీ కాని, ఇతర భాషలనుగాని అధికారిక అవసరాల కోసం సుప్రీంకోర్టు, హైకోర్టులలో ఉపయోగించవచ్చు. ఉత్తరప్రదేశ్, బీహార్, రాజస్థాన్, మధ్యప్రదేశ్ రాష్ట్రాలు తమ హైకోర్టుల ముందు విచారణలను కొనసాగించేందుకు ఆయా గవర్నర్లు అనుమతి ఇచ్చారు. తమిళనాడు రాష్ట్రం కూడా స్థానిక భాషను ఉపయోగించేందుకు ప్రయత్నాలు సాగిస్తోంది. అయితే ఈ అంశాలు హైకోర్టు తీర్పు వెలువరించే సమయంలో వర్తించవు. తుదితీర్పులను తప్పనిసరిగా ఆంగ్లంలోనే వెలువరించాల్సి ఉంటుంది. అధికార భాషా చట్టం 1963 ప్రకారం హైకోర్టు తమ తీర్పులను ఆంగ్లంలో కాకుండా ఇతర భాషల్లోకి ఇవ్వడానికి గవర్నర్ అనుమతి అవసరం అవుతుంది. దీనికి ముందు రాష్ట్రపతి ముందస్తు అనుమతి కూడా తప్పనిసరి. అయితే సుప్రీంకోర్టు విషయంలో ఇలాంటి నిబంధనలు ఏవీ వర్తించే అవకాశం లేకపోవడంతో ఆ స్థాయిలో కేవలం ఆంగ్లంలోనే కోర్టు వ్యవహారాలు కొనసాగుతాయి. అధికార భాషా చట్టం అమలులోకి వచ్చిన తరువాత అన్ని ప్రభుత్వ కార్యాలయాల్లో దాదాపుగా స్థానిక భాషలు చలామణి అవుతున్నాయి. చివరకు అధికారుల కార్యాలయాల ముందు కూడా తెలుగులోబోర్డులు వెలిసాయి. గతంలో కలెక్టర్ కార్యాలయాల్లో కేవలం ఆంగ్లంలోనే ఫైళ్లు ఉండేవి. ప్రస్తుతం పూర్తిగా మార్పు వచ్చింది. ఏదైనా పనిపై ప్రభుత్వ కార్యాలయాలకు వెళ్లే వారు అర్జీని ఇవ్వాలంటే కార్యాలయం బయట చెట్టు కింద ఉండే కొందరు దరఖాస్తు రాసి ఇచ్చే వారు. దీనికి కొంత మొత్తం తీసుకునే వారు. ప్రస్తుతం తెలుగులోనే లావాదేవీలు జరగడంతో ఎవరికి వారు అర్జీలను స్వయంగా రాసి అందించే అవకాశం కలిగింది. అన్ని కార్యాలయాల్లో మార్పులు వచ్చినప్పటికీ కోర్టు లావాదేవీలు మాత్రం ఇప్పటికీ కేవలం ఆంగ్లంలోనే కొనసాగుతున్నాయి. ఐపిసి, సిఆర్‌పిసి సెక్షన్లకు సంబంధించిన పుస్తకాలు తెలుగులో లభిస్తున్నాయి. అయితే కోర్టులో వాదించే సమయంలో, పిటిషన్ వేసే సమయంలో మాత్రం తప్పనిసరిగా ఇంగ్లీషును వాడాల్సి వస్తోంది. దీనికి అనేక కారణాలు ఉన్నాయి. న్యాయమూర్తులను స్థానికంగా కాకుండా ఇతర రాష్ట్రాలకు సంబంధించిన వారిని నియమిస్తున్నారు. స్థానిక భాషను ఉపయోగించినప్పుడు వారు ఇబ్బందికి గురౌతున్నారు. హైకోర్టు స్థాయిలో చారిత్రాత్మకంగా స్థానిక భాషలో తీర్పు వెలువరించినప్పటికీ తప్పనిసరిగా ఆంగ్లంలో కూడా కాపీని తయారు చేయాల్సి వస్తోంది.

ముఖ్యంగా హైకోర్టు తరువాత సుప్రీంకోర్టును ఆశ్రయించాల్సి వస్తే స్థానిక భాష పనిచేయని పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం కంప్యూటర్ సాఫ్ట్‌వేర్‌లో భాషను తర్జుమా చేసే సౌలభ్యం ఉండటంతో కొందరు దానిని ఆశ్రయించి ఇతర భాషల నుంచి తమకు వచ్చిన భాషలోకి మార్చుకునే వెసులుబాటు కలుగుతోంది. అయితే తర్జుమా సమయంలో కంప్యూటర్ తనకు తెలిసిన పదజాలంతో చేస్తుంది. ఈ సమయంలో తీర్పులో న్యాయమూర్తి వ్యక్తీకరించిన భావాలు ప్రస్ఫుటంగా వెల్లడి చేసే అవకాశం ఉండదు. ఈ కారణం వల్ల ఇంగ్లీషు నుంచి తెలుగులోకి అనువదించినా మరో సారి అసలు తీర్పుతో సరిపోల్చుకోవలసి వస్తోంది. న్యాయపరమైన లావాదేవీలు ఇప్పటి వరకు పూర్తిగా ఆంగ్లంలోనే జరుగుతున్నందున మార్పు కొంత ఆలస్యంగా జరుగుతోంది. స్థానిక భాషల్లో తీర్పులు, ఆదేశాలు వెల్లడైతే కక్షిదారులకు కూడా ఎంతో ప్రయోజనం ఉంటుంది. ప్రస్తుతానికి తుదితీర్పులు మినహా మిగిలిన మధ్యంతర ఆదేశాలు, తాత్కాలిక నిలుపుదల అంశాలు వంటివి స్థానిక భాషల్లో వెలువరించాలన్న డిమాండ్ పెరుగుతోంది. కోర్టులకు హాజరయ్యే వారిలో 60 శాతం మంది వరకు ఆంగ్ల భాష మీద పట్టు ఉండటం లేదు.

ఒకవేళ ఆంగ్లం తెలిసినా కోర్టు పరిభాష పదాలు అర్థం కాని రీతిలో ఉంటున్నాయి. దీనితో బాధితులుగాని, నిందితులు గాని తమ విషయంలో కోర్టు ఏ విధమైన అభిప్రాయం వెల్లడి చేసిందన్న దానిపై సరైన అవగాహన ఉండటం లేదు. న్యాయవాదులు చెప్పిందే ప్రస్తుతం వేదవాక్కుగా ఉంటోంది. దీనితో న్యాయం కోసం కోర్టు మెట్లు ఎక్కడానికి అనేక మంది వెనకడుగు వేస్తున్నారు. స్థానిక భాషలో వాదోపవాదాలు, తీర్పులు, ఆదేశాలు వెలువడితే కక్షిదారులకు కొంత వరకు తమ కేసు పూర్వపరాలపై స్పష్టమైన అవగాహన కలిగే అవకాశం ఉంది.

– డాక్టర్ గిరీష్‌కుమార్ సంఘీ

ఆషాఢ మాసం వచ్చిందంటే తెలంగాణ రాష్ట్రమంతా పండగ వాతావరణమే. మహిళలందరికీ ఉత్సాహం ఉరకలు వేస్తుంటుంది. మహంకాళి, మైసమ్మ, పోచమ్మ, నల్లపోచమ్మ, ఎల్లమ్మ, పెద్దమ్మ, డొక్కాలమ్మ, అంకాలమ్మ, పోలేరమ్మ, మారెమ్మ.. ఇంకా ఎందరో గ్రామదేవతలు తమ కుటుంబాలని, గ్రామాలని కనిపెట్టుకుని కాచే అమ్మత ల్లులు.. వారికి ఉత్సవం చెయ్యాలి. బోనాలు సమర్పిం చాలి, జాతరలు చెయ్యాలి.



# అమ్మకు 'బోనం'

కవర్ స్టోరీ

పి.యస్.యమ్.లక్ష్మి

## బోనాలు

ఆషాఢ మాసంలో గురువారం, ఆదివారాలలో ఈ తల్లులందరికీ బోనాలు సమర్పించటం ఆనవాయితీగా వస్తున్నది. తెలంగాణ ప్రత్యేక రాష్ట్రమయిన తర్వాత బోనాల పండగని రాష్ట్రీయ పండగగా నిర్వహిస్తున్నారు. తొమ్మిది వారాల పాటు సాగే ఈ బోనాల పండగ తెలంగాణ సంస్కృతి సాంప్రదాయాలకు మచ్చుతునక.

ఆషాఢ మాసంలో దేవి తన పుట్టింటికి వస్తుందని నమ్మకం. అందుకే భక్తులు ఈ పండగ సమయంలో దేవిని దర్శించుకుని తమ స్వంత కూతురు తమ ఇంటికి వచ్చిన భావనతో, భక్తి శ్రద్ధలతోనేగాక, ప్రేమానురాగాలతో బోనాలను నైవేద్యంగా సమర్పిస్తారు.

బోనం అంటే భోజనం. అమ్మవారికి సమర్పించే నైవేద్యం. కొందరు వండిన అన్నంలో పాలు, బెల్లం కలిపి, కొందరు అన్నం, ఉల్లిపాయలతో కలిపి బోనాన్ని తయారు చేస్తారు. కొత్త మట్టికుండను పసుపు, కుంకుమ, సున్నంలతో అందంగా అలంకరించి, కుండ పైన వేపకొమ్మలు పెట్టి పైన ప్రమిదలో దీపం వెలిగిస్తారు. తమ చుట్టపక్కాలతో, ఇరుగు-పొరుగుతో కలిసి ఆ కుండలని నెత్తిమీద పెట్టుకుని బయల్దేరుతారు. అందంగా అలంకరించుకున్న మహిళలు, ఇంకా అందంగా అలంకరించిన బోనాల పాత్రలని తీసుకుని భక్తి శ్రద్ధలతో అమ్మవారి గుడికి బయల్దేరితే కోలాహలం కూడా వుండాలి కదా. అందుకే డప్పుల వాయిద్యాలు, పోతురాజుల హడావిడి, వారిని చూసి దడుసుకునే చిన్న పిల్లలు, సందడికేం తక్కువ వుండదండీ. పూనకం పట్టిన కొందరు స్త్రీలు తలపై బోనాలని మోస్తూనే డప్పులవాళ్ల లయబద్ధమైన మోతలకు అనుగుణంగా దేవిని స్మరిస్తూ నర్తిస్తారు.

బోనాలను మోసుకెళ్తున్న మహిళలను దేవీఅమ్మవారు ఆవహిస్తారని విశ్వాసం. మహంకాళి అంశ రౌద్రానికి చిహ్నం. అందుకే వాళ్లని శాంతపరచడానికి ఈ మహిళలు ఆలయం దగ్గరకు వస్తున్న సమయంలో వారి ముందు మిగిలిన భక్తులు నీళ్ల పోస్తారు.

ఏవైనా ఆపదలు వచ్చినప్పుడు తాము నమ్మిన అమ్మవారికి మొక్కుకుంటారు కొందరు. ఆపద గట్టెక్కిస్తే బోనమెత్తుతామని కొందరు, ఆనవాయితీగా మరికొందరు చేస్తారు. మహిళలు తెచ్చిన బోనాలని ఆలయంలో ఒక చోట కుప్పగా పోస్తారు. దాని మీద పసుపు, కుంకుమ వేసి అమ్మకి నైవేద్యం పెట్టి, ముడుపులు చెల్లించుకుని, తమని చల్లగా కాపాడమని ప్రార్థిస్తారు. ఈ సందర్భంగా జంతుబలి కూడా ఉంటుంది. ఇదివరకు దున్నపోతులని బలి ఇచ్చేవారట. ఇప్పుడు ఆ ఆనవాయితీ పోయింది. కోడిపుంజులని మాత్రం ఇస్తారు.

## ఆలయాలు-అలంకరణ

భక్తులందరూ వస్తున్నప్పుడు ఆలయాలని కూడా అలంకరించాలిగా... అందువల్ల ముందునుంచే ఆలయాధికారులు తమ నిర్వహణలో వున్న ఆలయాలను మరమ్మత్తులు చేయించి, రంగులు వేయించి, ఉత్సవాలకు సిద్ధం చేస్తారు. అమ్మవార్లకు ప్రత్యేక పూజలు చేస్తారు. పండుగ జరిగే ప్రాంతాలలో వేపాకులతో అలంకరించబడిన వీధులు దర్శనమిస్తాయి.

జానపద శైలిలో ఉండే అమ్మవారి కీర్తనలతో నిండిన మైకుసెట్ల హోరుతో వాడ వాడలా పండగ వాతావరణం నెలకొంటుంది. తండోప తండాలుగా వచ్చే భక్తులకు ఏ విధమైన అసౌకర్యం కలగకుండా శ్రద్ధ



తీసుకుంటారు.

**తొట్టెలు**

ఈ సందర్భంగానే భక్తులు ఇంటి ఆడపడచు అమ్మవారిని తొట్టెలో ఊగించి లాలించేందుకు తొట్టెను సమర్పిస్తారు. ఈ తొట్టె సమర్పణతో బాలారిష్టాలు పోతాయని, సంతానం లేనివారికి సంతానం కలుగుతుందని విశ్వాసం. ఈ తొట్టెలను కర్రలు, రంగు రంగుల కాగితాలతో అందంగా తయారు చేస్తారు. వీటిని కూడా ఊరేగింపుతో తీసుకువచ్చి అమ్మవారికి సమర్పిస్తారు.

**పోతురాజు**

పోతురాజుని అమ్మవారి సోదరుడంటారు. బోనాల ఊరేగింపులలో ముందు నడిచే పోతురాజుది ప్రముఖ పాత్ర. ఇదివరకు కొంతమంది వంశాచారంగా, ఆనవాయితీగా పోతురాజు వేషం వేసేవారు. ఇప్పుడు అలాంటివారు చాలా తక్కువమంది వున్నా, ఔత్సాహికులు చాలా మంది పోతురాజు వేషం వేస్తున్నారు. పోతురాజు పాత్రను పోషించే వ్యక్తి స్ఫురద్రూపిగా బలంగా ఉంటాడు. ఒంటిపై పసుపు పూసుకుని, నుదుటిపై పెద్ద కుంకుమబొట్టు పెట్టుకుని చిన్న ఎర్రని ధోవతిని ధరించి, కాలికి ఘల్లు ఘల్లుమని మోగే గజ్జెలు కట్టుకుని, డప్పు వాయిద్యానికి అనుగుణంగా నాట్యం చేస్తాడు. ఒక్కొక్కసారి ఈయన నోట్లో నిమ్మకాయ ధరిస్తాడు. చేతిలో కొరడాతో కొట్టుకుంటూ రౌద్రంగా నాట్యం చేసే పోతురాజులని చూసి కొందరు చిన్న పిల్లలు భయపడతారు. ఆయన దగ్గరకు రాగానే పారిపోయి, దూరంగా వెళ్లగానే నాట్యం చూడాలనే కుతూహలంతో మళ్లీ వస్తారు. ఈయన పూజా కార్యక్రమాలకు ఆరంభకుడే కాదు, భక్త సమూహాలకి రక్షకుడు కూడా.

**విందులు, సంబరాలు**

బోనాల పండగ నైవేద్యం సమర్పించే పండగ అయినందువల్ల ఆ ప్రసాదాన్ని కుటుంబ సభ్యులు అతిథులతో పాటు స్వీకరిస్తారు. అమ్మవారికి బోనాలు సమర్పించిన తర్వాత ఇంట్లో బంధు, మిత్రులతో మాంసాహార విందుభోజనం చేస్తారు.

**ఫలహారపు బళ్లు**

బోనాల రోజు సాయంత్రం రకరకాల ఫలహారాలు బళ్లలో తీసుకువచ్చి అమ్మవారి ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేయిస్తారు. ఈ ఊరేగింపులో కూడా అత్యధిక సంఖ్యలో భక్తులు పాల్గొంటారు. అందంగా అలంకరించిన ఫలహారాపు బళ్లతో, పోతురాజుల విన్యాసాలతో, యువకుల నాట్యాలతో ఊరేగింపు ఉత్సాహంగా సాగుతుంది.

**ఘటం**

ఒక రాగి కలశాన్ని అలంకరించి దానిని అమ్మవారి ప్రతిరూపంగా భావిస్తారు. దానినే ఘటం అంటారు. ఈ ఘటాన్ని సాంప్రదాయమైన వస్త్రధారణతో, ఒంటికి పసుపు రాసుకున్న పూజారి నెత్తిన పెట్టుకుని తీసుకురాగా, పండగ మొదటిరోజు నుంచి, చివరి రోజుదాకా ఆలయ పరిసర ప్రాంతాలలో రోజూ డప్పుల మేళాలతో ఊరేగిస్తారు. చివరి రోజున ఊరేగింపుగా తీసుకువెళ్లి నిమజ్జనం చేస్తారు. ఈ ఊరేగింపులో పోతురాజులే కాక పౌరాణిక వేషాలు ధరించిన ఉత్సాహవంతులు కూడా పాల్గొని ఊరేగింపుకి అందాన్ని తెస్తారు.

**రంగం**

బోనాలు సమర్పించిన మరునాడు రంగం జరుగుతుంది. దీనిలో ఒక అవివాహిత అయిన స్త్రీ ఒక పచ్చి కుండ మీద నుంచుని భవిష్యత్ గురించి చెబుతుంది. ఆ సమయంలో ఆవిడని అమ్మవారు ఆవహించి ఆవిడచేత భవిష్యత్ చెప్పిస్తారని భక్తుల నమ్మకం. భవిష్యత్ అంటే ఆసక్తి లేనిది ఎవరికి? భక్తులు చాలా పెద్ద సంఖ్యలో ఈ కార్యక్రమానికి హాజరవుతారు.

జంట నగరాలలో బోనాల వైభవం బోనాల సమర్పణకి కూడా కొన్ని నియమాలున్నాయి. ఈ బోనాలు ముందుగా గోల్కొండ కోటలోని జగదంబా మహాకాళి ఆలయంలోని అమ్మవారికి సమర్పిస్తారు. తర్వాత మిగతా ఆలయాలలో.

**జగదంబా మహాంకాళి ఆలయం, గోల్కొండ**

ఈ ఆలయం 900 సంవత్సరాల క్రితం నుంచి వున్నది. అంటే గోల్కొండ కోట కట్టటానికన్నా ముందే ఈ ఆలయం వున్నది. పూర్వం ఈ కొండమీద గొల్లవారు పశువులను మేపుకోవటానికి వచ్చేవారు. ఇది వాళ్లు కనుగొన్న ఆలయమని ఒక కథనం ప్రచారంలో వుంది.



ఇంకొక కథనం ప్రకారం కాకతీయ రాజు ప్రతాపరుద్రుడు ఈ కొండ మీద మట్టికోట కట్టించేటప్పుడు అక్కడ అమ్మవారిని పూజించి బోనాల పండగ చేశారు. ఈ మట్టికోట గొల్లవాళ్ల పాలించేవారు. అప్పటినుంచి దీనిని గొల్లకోట అనేవారనీ, అదే క్రమంగా గోల్కొండ అయిందంటారు. అప్పటినుంచి ఇక్కడ బోనాల ఉత్సవం నిర్వహిస్తున్నారు.



నుంచి చార్మినార్ దాకా సొరంగ మార్గం వుందని అంటారు. అది ఇప్పుడు మూసేశారు. బోనాల ఉత్సవాలు ఈ ఆలయంలో ప్రారంభమై 9 వారాల పాటు అంటే 2 నెలల 15 రోజులు అమ్మవారిని కొలుస్తారు. ఈ సమయంలో ప్రతి గురువారం, ఆదివారం భక్తులు అమ్మవారికి బోనాలు సమర్పిస్తారు.

అందువల్లనే కాబోలు.. అతి పురాతనమైన ఈ ఆలయంలో ముందుగా బోనాల ఉత్సవం ప్రారంభమవుతుంది. హిందూ ముస్లిమ్‌ల సమైక్యతకు చిహ్నంగా, నిజాం సమయంలో జరిగిన బోనాల ఉత్సవాలలో ముస్లింలు కూడా సోదర భావంతో పాల్గొనేవారు. రాష్ట్ర ప్రభుత్వం బోనాల సందర్భంగా అమ్మవారికి పట్టువస్త్రాలు లంగర్ హౌస్ చౌరస్తాలో ఆలయ కమిటీవారికి అందచేస్తారు. అలాగే ఈ ఆలయ కమిటీ తరపున జంట నగరాలలోని సికింద్రాబాద్ ఉజ్జయిని మహంకాళి అమ్మవారికి, లాల్ దర్వాజా అమ్మవారికి, ఇంకా కొన్ని ఆలయాలలో అమ్మవార్లకు పట్టువస్త్రాలు అందజేస్తారు. ప్రభుత్వ ప్రతినిధులు పట్టువస్త్రాలు ఆలయ కమిటీకి అందజేసిన తర్వాత చుట్టుపక్కల ప్రాంతాల నుంచి భక్తులు తీసుకువచ్చిన తొట్టెల ఊరేగింపు ప్రారంభమవుతుంది. మధ్యాహ్నం ప్రారంభమయ్యే ఈ ఊరేగింపు రాత్రి వరకూ సాగుతుంది. గోల్కొండ ప్రాంతంలో వుండే ఆలయ పూజారి గారి ఇంటి నుంచి అమ్మవారి విగ్రహాన్ని కూడా ఊరేగింపుగా తీసుకువెళ్తారు. ఈ ఉత్సవాలకు సమీపంలోనివారే కాక చుట్టుపక్కల జిల్లాల నుంచి కూడా భక్తులు ఎక్కువ సంఖ్యలో హాజరవుతారు. అమ్మవారికి తొమ్మిది వారాల పాటు పూజలు నిర్వహిస్తారు కదా. ఈ తొమ్మిది వారాలలో ఉజ్జయినీ మహంకాళి బోనాలు, లాల్ దర్వాజా అమ్మవారి బోనాలతో పాటు అన్ని ప్రాంతాలలో కూడా ఈ ఉత్సవాలు ప్రారంభమవుతాయి.

### ఆలయం

ఆలయం ఇక్కడ చాలాకాలం పెద్ద ఆచ్ఛాదన లేకుండా వున్నదట. ఇప్పుడు కూడా ఆలయం చిన్నదే. అయితే అనేక శతాబ్దాల నుండి పూజలందుకున్న తల్లి మహిమ మాత్రం అనంతమని ఆలయంలో బోనాలు సమర్పించే భక్తులను చూస్తే తెలుస్తుంది. ఈ ఆలయం కింద



తొమ్మిది వారాలు అమ్మవారికి పూజలు చేసిన తర్వాత తొమ్మిదవ వారంతో ఈ ఉత్సవాలు ముగుస్తాయి. ఘటం ఉత్సవం, రంగం తర్వాత జరుగుతుంది.

### ఉజ్జయిని మహంకాళి ఆలయం, సికిందరాబాద్

సికిందరాబాద్ జనరల్ బజారులో కిక్కిరిసిన దుకాణాల మధ్య వుందీ ఆలయం. మొదట్లో ఇక్కడ ఆలయం మాత్రమే ఉండేది. తర్వాత జనావాసాలు పెరిగాయి. ఈ ఆలయం వెనుక ఒక చిన్న కథ ఉన్నది. క్రీ.శ.1813లో సురిటి అప్పయ్య అనే ఆయన మిలటరీలో పనిచేస్తూ ఈ ప్రాంతాల్లో వుండేవారు. ఆయనకి ఉజ్జయినీ బదిలీ అయితే అక్కడికి వెళ్లారు. ఒకసారి అక్కడ కలరా వ్యాధి తీవ్రంగా ప్రబలి, చాలా మంది చనిపోసాగారు. అప్పుడు అప్పయ్యగారు ఉజ్జయిని మహంకాళి ఆలయానికి వెళ్లి ఆ తల్లికి మొక్కుకున్నారు. కలరా తగ్గిస్తే తన స్వంత ఊరులో అమ్మవారికి ఆలయం నిర్మిస్తానని. కలరా వ్యాధి తగ్గింది. రెండు ఏళ్ల తర్వాత స్వస్థలానికి వచ్చిన అప్పయ్య దారుతో అమ్మవారి విగ్రహాన్ని చేయించి ఒక వేప చెట్టు కింద వుంచి పూజించసాగారు. తర్వాత చిన్న ఆలయం..



ఆ తర్వాత ఆలయం విస్తీర్ణం చేసే సందర్భంలో తూర్పు వైపు వున్న బావిని మరమ్మత్తు చేయిస్తుంటే మాణిక్యాంబ విగ్రహం దొరికింది. అమ్మవారి ఆనతి ప్రకారం అమ్మవారి విగ్రహం పక్కనే మాణిక్యాంబ విగ్రహాన్ని ప్రతిష్ఠించారు. క్రీ.శ.1864 సంవత్సరంలో సురిటి అప్పయ్య సారథ్యంలో ఇదివరకున్న విగ్రహాల స్థానంలో ఇప్పుడున్న మూర్తులను ప్రతిష్ఠించారు. అప్పటి నుంచి ఇక్కడ శాస్త్రోక్తంగా నిత్యపూజలు జరుగుతున్నాయి.

## అమ్మవారు

ఇక్కడ అమ్మవారు ఒక చేతిలో ఖడ్గంతో, మరో చేతిలో భరిణితో దర్శనమిస్తారు. పక్కనే మాణిక్యాంబ దర్శనమిస్తుంది. ముందు వున్న వేపచెట్టుని అలాగే వుంచి చుట్టూ ఆలయం నిర్మించారు. ఉపాలయంలో ఈశ్వరాంశ సంభూతుడైన వీరభద్రస్వామి చతుర్భాజాలతో ఎదురుగా నందీశ్వరుడితో సహా దర్శనమిస్తాడు. గోల్కొండలో బోనాల ఉత్సవం మొదలయిన మూడవ ఆదివారం ఈ ఆలయంలోనూ, ఈ పరిసర ప్రాంతాలలోని వందకు పైగా ఆలయాలలో ఉత్సవాలు ప్రారంభమవుతాయి. అదే రోజు సాయంత్రం ఫలహారంబళ్ల ఆలయం చుట్టూ ప్రదక్షిణ చేస్తాయి. మరునాడు మహంకాళి, మాణిక్యాంబల చిత్రపటాలను ఏనుగు మీద ఊరేగిస్తారు. ఇక్కడ బోనాల మరుసటి రోజు జరిగే రంగం చాలా ప్రసిద్ధి చెందింది. ఘటం ఊరేగింపు పరిసర ప్రాంతాలలో రోజుకొక వీధిలో జరుగుతుంది.

## ఊరేగింపు

హరిబౌలిలోని అక్కన్న, మాదన్న దేవాలయం వారి ఘటంతో ఏనుగు అంబారిపై, అశ్వాల మధ్య అక్కన్న, మాదన్నల బొమ్మల నడుమ ఊరేగింపు మొదలై సాయంత్రానికి కన్నుల పండుగగా నయాపూల్ వద్ద ఘటాల నిమజ్జనతో ముగుస్తుంది.



అక్కన్న-మాదన్న మాతా మహంకాళి ఆలయంగా సుప్రసిద్ధమైన హరిబౌలి ఆలయంలో బోనాల రోజున రాష్ట్ర ప్రభుత్వం తరపున అమ్మవారికి పట్టుచీరెను కానుకగా సమర్పించే సంప్రదాయం కొనసాగుతున్నది. లాల్‌దర్వాజా నుండి నయాపూల్ వరకు వీధుల వెంబడి వేలాది మంది ప్రజలు నిలుచుని అంగరంగ వైభవంగా అలంకరించబడిన ఘటాలను చూస్తారు. పోతురాజుతో పాటు వివిధ పౌరాణిక వేషధారణలలో ఉన్న కుర్రవాళ్లు తమదైన రీతిలో జానపద గీతాలు, వాయిద్యాల మధ్య నృత్యం చేస్తారు.



తెలంగాణలో బోనాలు ఒక్కో ప్రాంతంలో ఒక్కో రీతిలో.. ఆ తల్లిని పోచమ్మ, మైసమ్మ, ఎల్లమ్మ, ముత్యాలమ్మ, మరిడమ్మ, మహంకాళమ్మలుగా పూజిస్తారు. రూపం ఏదైనా భావమొక్కటే. "సల్లంగ మమ్ము సూడు తల్లీ" అని నిండు మనసుతో పూజిస్తారు. తెలంగాణ జీవితంలోని మాధుర్యాన్ని చవిచూపించే సాంస్కృతిక వేడుక ఈ బోనాల పండుగ.

– ఫొటోలు
**శ్రీరాముల శ్రీధర్**



## కార్టూన్లకు ఆహ్వానం

కార్టూనిస్టుల నుండి ఆరోగ్యకరమైన హాస్యాన్ని అందించే కార్టూన్లను స్వాగతిస్తున్నాం. అంశం ఏదైనా సరే! మంచి హాస్యాన్ని అందించాలి. కార్టూన్లతో పాటు మీ పేరు, చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా జతచేయాలి. ఎంపిక కాని కార్టూన్లు తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. కార్టూన్లు పంపించాల్సిన చిరునామా:
ఎడిటర్, ఆదివారం వార్త, నం.396,
లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80.
**sunmagvaartha@gmail.com**



# తరం మారుతోంది..

'మేం మార్పుని స్వాగతిస్తున్నాం. సిబ్బంది సంక్షేమానికి ప్రాధాన్యమిచ్చే సంస్థల్లో ముందు వరుసలో ఉంటాం. మా ప్రొఫెషనల్ పార్ట్‌నర్స్ (సిబ్బందినే ఇప్పుడు భాగస్వాములని అంటున్నారు), వారంలో ఎక్కువ రోజులు హైబ్రిడ్, రిమోట్ వర్క్‌కి అవకాశం కల్పిస్తాం. కొన్ని ఉద్యోగాల్లో మాత్రమే తప్పనిసరిగా కార్యాలయంలో ఉండి పనిచేయాల్సి ఉంటుంది. అవేమిటో ఉద్యోగావకాశాల ప్రకటనలో స్పష్టంగా చెబుతాం..'లింక్డ్ఇన్‌లో ఓ కంపెనీ పోస్ట్ ఇది.
ప్రతిభావంతులైన ఉద్యోగుల్ని అదీ యువతరాన్ని ఆకట్టుకోవడమూ, మరో సంస్థకి వెళ్లిపోకుండా తమ దగ్గరే అట్టిపెట్టుకోవడమూ ఇప్పుడు సంస్థలకి కత్తిమీద సాములా తయారైంది. కొత్తగా ఉద్యోగాల్లో చేరుతున్న అబ్బాయిలూ అమ్మాయిలూ ఏడాది తిరక్కుండానే మానేసి మరో ఉద్యోగం వెతుకుంటున్నారుట. గత రెండుమూడేళ్లలో ఉద్యోగంలో చేరినవారిలో 53శాతం అప్పుడే ఉద్యోగాలు మారారని డెలాయిడ్ నివేదిక చెబుతోంది. అందుకే తమ సంస్థల్లో పనితీరు గురించీ తాము అనుసరించే విలువల గురించీ ఉద్యోగుల సౌకర్యానికి తామిచ్చే ప్రాధాన్యం గురించీ సంస్థలు సామాజిక మాధ్యమాల్లో ఇలాంటి పోస్టులు పెడుతున్నాయి. గతంలో ఎప్పుడూ లేనిది ఇప్పుడే ఎందుకీ పరిస్థితి వచ్చిందీ అంటే 'తరాల అంతరం' అంటున్నాయి అధ్యయనాలు.
పరిశ్రమలూ, వ్యాపార, ఆర్థిక సంస్థలూ దశాబ్దాలుగా కొనసాగుతున్నవి ఉన్నాయి. అనునిత్యం అభివృద్ధి చెందుతున్న శాస్త్రసాంకేతిక రంగాల పుణ్యమా అని ఎప్పటికప్పుడు కొత్తకొత్తగా అంకుర సంస్థలూ పుట్టుకొస్తున్నాయి. వీటన్నిటిలోనూ పనిచేయడానికి ఉద్యోగులు కావాలి. అందుకని అవసరానికి తగినట్లుగా ఆయా సంస్థలన్నీ తమవైన విధివిధానాలను రూపొందించుకుని ఉద్యోగులను భర్తీ చేసుకుంటూ ఉంటాయి. గత యాభైఏళ్లలో అలా ఉద్యోగాల్లో చేరినవారిని పరిశీలిస్తే ఇప్పటికి మూడుతరాలవారు చేరారనీ ఇప్పుడు చేరుతున్నది నాలుగోతరమనీ అంటున్నారు నిపుణులు.
పాతికేళ్లకు అటూఇటూగా ఉండి ఇప్పుడే కొత్తగా ఉద్యోగంలో చేరుతున్నవారినే 'జనరేషన్ జడ్' అంటున్నారు. వచ్చే ఐదారేళ్లలో ప్రపంచవ్యాప్తంగా ఉద్యోగుల్లో మూడోవంతు వీళ్లే ఉంటారట. దాంతో సంస్థలన్నీ అందుకు తగినట్లుగా మారడం మొదలెట్టాయి.

## మార్పు అనివార్యం

ఒకప్పుడు ప్రతిదానికీ ఓప్పిగ్గా వేచిచూడాల్సి వచ్చేది. పరీక్ష ఫలితాలను ఇవాళ ప్రకటిస్తే మర్నాడు పొద్దున్న పేపరు వస్తేనే పాసయిందీ లేనిదీ తెలిసేది. పాస్‌పోర్ట్ సైజు ఫొటోలు తీయించుకుంటే మూడురోజుల తర్వాత చేతికొచ్చేవి. ఉద్యోగానికి దరఖాస్తు చేస్తే పోస్టులో ఇంటర్వ్యూకి కార్డు వచ్చేవరకూ వేచిచూడాల్సి వచ్చేంది.
ఇప్పుడలా కాదు..ఇది ఇన్‌స్టంట్ కాలం. పరీక్ష రాసిన మర్నాడే సమాధానాల 'కీ' విడుదలైపోతుంది. ఎన్ని మార్కులు వస్తాయో, ఏ కాలేజీలో సీటు వచ్చే అవకాశముందే తెలిసిపోతోంది. షాపుకెళ్లకుండానే కోరుకున్నవి ఇంటికొచ్చి వాలుతున్నాయి. వేచి చూడడం అంటే ఏమిటో ఈ తరానికి తెలియదు. ఇది చూడటానికి చిన్న విషయంగానే ఉన్నా మొత్తంగా వ్యక్తిత్వాలనీ ఆలోచనాధోరణుల్నీ పనిచేసే విధానాన్నీ మార్చేస్తోంది. అందుకే తరాల అంతరాల్ని నిశితంగా అధ్యయనం చేయడం మొదలెట్టాయి పరిశోధనా సంస్థలు. యువత వ్యక్తిత్వాల్లో అభిప్రాయాల్లో ఇష్టాయిష్టాల్లో వస్తున్న మార్పులు తెలుసుకుంటే తదనుగుణంగా అన్ని రంగాల్లోనూ మార్పులు చేసుకోవచ్చున్నది వారి ఉద్దేశం.

## మిలెనియల్స్ మార్చేశారు!

ప్రభుత్వ ఉద్యోగాలకి గౌరవమూ హోదా ఉంటాయి. అన్నిటినీ మించి స్థిరత్వం ఉంటుంది. ప్రైవేటు ఉద్యోగాలకు గ్యారంటీ ఉండదు. అందుకని కష్టమైనా సరే ప్రభుత్వ ఉద్యోగం సాధించాలి. ఇలా ఉండేది ఒకప్పటి యువత ఆలోచనాధోరణి.

తప్పనిసరి పరిస్థితుల్లో మాత్రమే ప్రైవేటు ఉద్యోగాలవైపు వెళ్లేవారు. ఆ ధోరణిని మార్చి విభిన్న రంగాలవైపు చూపు సారించడం మొదలెట్టిన 'జనరేషన్ ఎక్స్' సరికొత్త రంగాల్లో ప్రవేశించి నిబద్ధతతో పనిచేసింది. ఆ తర్వాత ఉద్యోగరంగంలో విప్లవాత్మకమైన మార్పులకు శ్రీకారం చుట్టింది 'మిలెనియల్స్' తరం. తల్లిదండ్రులు క్రమశిక్షణతో రేయింబగళ్లు కష్టపడటాన్ని చూసిన ఈ తరమే 'వ్యక్తిగత వృత్తిగత' జీవితాలమధ్య సమతూకం 'వర్క్ లైఫ్ బ్యాలెన్స్' అన్న అంశానికి ఎక్కువ ప్రాధాన్యం ఇచ్చింది. నేరుగా నాయకత్వ పదవుల్లో చేరడానికీ వీరే దారివేశారు. నిర్ణీత పనిగంటలు కాక పని పూర్తయ్యేవరకూ పనిచేయడమనే పద్ధతీ వీళ్లే ప్రారంభించారు. టీమ్‌వర్క్‌ని ఇష్టపడతారు. విద్యావంతులైన తల్లిదండ్రులు ఎక్కువగా ఉన్న తరం కావడంతో స్వేచ్ఛగానూ బాధ్యతాయుతంగానూ పెరగడం వల్ల ఉద్యోగంలోనూ ఆ లక్షణాలు చూపిస్తారు. సొంత వ్యాపా రాలవైపు మొగ్గు చూపడంలోనూ వీరే ముందున్నారు. తమ సామర్థ్యాన్ని ప్రదర్శించే మరింత మంచి అవకాశం కోసం నిరం తరం అన్వేషిస్తుంటారు. ప్రస్తుతం ఉద్యోగ వ్యాపార ప్రపంచా ల్లో కీలకపాత్ర నిర్వహిస్తున్నది వీరే. ఈ మిలెనియల్స్ స్ఫూర్తిని కొనసాగిస్తూ మరో అడుగు ముందుకేసింది 'జనరేషన్ జడ్'.

## నచ్చితేనే చేస్తాం

'ఆ మధ్య ఒక పాతికేళ్ల కుర్రాడు ఉద్యోగంలో చేరి రెండు నెలలకే మానేశాడు. వెళ్లిపోయేటప్పుడు కారణం చెప్పమంటే తనకి ఉద్యోగం ఆశించిన 'కిక్'ని ఇవ్వలేదన్నాడు. కానీ ఇలా రెండునెలలకే జాబ్ మారిన విషయాన్ని సీవీలో రాసుకుంటే బాగోదు కదా అనడిగితే అదేమంత పెద్ద విషయం కాదన్నాడు. ఈ తరం వాళ్లు మరీ ముక్కుసూటిగా కచ్చితంగా ఉంటున్నారు. నేరుగా సీఈఓ గదిలోకి వెళ్లిపోయి తమ మనసులో మాట చెప్పేస్తారు. దేనికీ సంకోచించరు' అంటారు ఓ అధికారి. పదేళ్ల క్రితం క్యాంపస్ సెలక్షన్స్‌లో ఉద్యోగం ఎక్కడా, జీతం ఎంత అన్న ప్రశ్నలే అభ్యర్థుల నుంచి ప్రధానంగా వినిపించేవట.



ఇప్పుడు భిన్నమైన ప్రశ్నల్ని స్పష్టంగా అడుగుతున్నారని అంటున్నారు మెక్సిన్సే కంపెనీ నిపుణులు. సంస్థలో తమ కెరీర్ గ్రోత్ ఎలా ఉండబోతోందన్న విషయంతో మొదలెట్టి సమాజహితానికి ఆ సంస్థ చేస్తున్నదేంటీ, తన అభిప్రాయానికి అక్కడ విలువ ఉంటుందా అని కూడా వాళ్లు అడుగుతున్నారట. స్వతంత్ర భావాలు ఎక్కువగా ఉన్న ఈ తరం తమకు నచ్చినట్లుగానే ఉంటారనీ, జీతం కన్నా చేస్తున్న పనివల్ల సమాజానికి చేకూర్చే ప్రయోజనానికి విలువిస్తారనీ వారు చెబుతున్నారు. సంస్థ అనుసరిస్తున్న విలువలను పరిశీలిస్తారు. పర్యావరణ పరిరక్షణకు ఏం చేస్తున్నారని ప్రశ్నిస్తారు. ఉద్యోగాల్లో ఎలాంటి వ్యత్యాసమూ చూపకుండా అన్ని వర్గాలవారినీ చేర్చుకుంటున్నారా లేదా అని శోధిస్తారు. అలా అన్ని అంశాల్లోనూ సంస్థ పద్ధతులు నచ్చితే అప్పుడు 'ఈ సంస్థలో నేనేవిధంగా నాదైన ప్రత్యేకతను చూపగలుగుతాను' అని ఆలోచిస్తారు. సమాజంపై చెప్పుకోదగ్గ ప్రభావం చూపని సంస్థల్లో పనిచేయడానికి ఇష్టపడని ఈ నవతరం ఏ మాత్రం మొహమాటం లేకుండా వదిలి వెళ్లిపోతోంది అంటున్నారు నిపుణులు. అసలీ తరానికి చెందిన పిల్లలు అవసరమైతే కొంతకాలం ఖాళీగా ఉండి అయినా తాము ఏ రంగంలో రాణించగలరో ఆలోచించి, నచ్చిన ఉద్యోగంలోనే చేరుతున్నారు అంటున్నాయి మానవ వనరుల నివేదికలు. డిమాండ్ ఎక్కువ



నిజానికి వర్క్ ఫ్రమ్ హోమ్ విధానాన్ని కొవిడ్ సమయంలో మొదలుపెట్టారు. సాధారణ పరిస్థితులు నెలకొన్నాక కూడా మానకుండా కొనసాగించడానికి కారణం ఈ యువతరమే. మూడ్‌ని బట్టి ఆఫీసుకు వస్తారు, లేదంటే ఇంట్లోంచే పనిచేస్తామంటారు. అందుకే వీరికోసం హైబ్రిడ్ వర్క్ కల్చర్‌ని కొనసాగిస్తున్నాయి కంపెనీలు. డిజిటల్ తరంలో పుట్టి పెరిగిన వీరి నైపుణ్యాలకు ఇప్పుడు విపరీతమైన డిమాండు ఉంది. అందుకే ఇలా రకరకాల ప్యాకేజీలూ వెసులుబాట్లతో వారిని ఆకర్షించాల్సి వస్తోంది. అమెజాన్ వెబ్ సర్వీసెస్, గ్యాలప్ సంస్థలు సంయుక్తంగా వెలువరించిన ఒక నివేదిక ప్రకారం భారతదేశంలో 97శాతం కంపెనీలు డిజిటల్ నైపుణ్యాలు తెలిసిన సిబ్బంది తమకు తక్షణావసరమనీ కానీ నిపుణుల్ని ఎంచుకోలేకపోతున్నామనీ చెప్పాయట. సరిగ్గా కంపెనీలకు అవసరమవుతున్న సరికొత్త ప్రతిభానైపుణ్యాలు కొరవడిన సమయంలో ఈ కొత్తతరం ఉద్యోగరంగంలోకి ప్రవేశించడం వల్లే కంపెనీలు వీరికోసం తమను తాము మార్చుకుంటున్నాయి.

## మారుతి నుంచి బజాజ్ వరకూ

మారుతి సుజుకి సంస్థ గురుగ్రామ్‌లో ప్రత్యేకంగా 'మొబిలిటీ అండ్ ఇన్నొవేషన్ హబ్'ని ఏర్పాటు చేసింది. కళాశాలలో ఉన్నప్పటి నుంచే విద్యార్థులకు రకరకాల ఓటీలు నిర్వహిస్తూ వారి అభిరుచులను ఆసక్తులనూ తెలుసుకుంటున్న ఈ సంస్థ జనరేషన్ జడ్ ఉద్యోగుల కోసం కార్యాలయాన్ని ప్రత్యేకంగా తీర్చిదిద్దింది. ఐఐటీ, ఐఐఎం స్టూడెంట్లు తమ స్టార్టప్ ఐడియాలతో ఈ హబ్‌కి వచ్చి ప్రయోగాలు చేసుకోవచ్చు. మధ్యమధ్యలో తోటివారితో ఆడుతూ పాడుతూ రిలాక్స్ అవవచ్చు. జనరేషన్ జడ్‌కి ఏం కావాలీ అన్నది ఇప్పుడు కంపెనీల ముందున్న పెద్ద ప్రశ్న. ఎవరికి వాళ్లు తమకు తోచిన రీతిలో ప్రయత్నాలు చేస్తున్నప్పటికీ అది సరిపోతుందన్న నమ్మకం కలగడం లేదు. అందుకే అధ్యయనాలు జరుపుతున్న సంస్థలన్నీ కలిసి జనరేషన్ జడ్ లక్షణాలను ఇలా క్రోడీకరించాయి.

➡ యూనివర్సిటీ విద్యకి ప్రాధాన్యమిస్తారు. డ్రాపవుట్ వ్యవహారం నచ్చదు. తమను తాము గౌరవించుకుంటారు.

➡ నిత్యం కొత్తదనం కావాలి. అది పనిలో కావచ్చు. చుట్టూ ఉన్న వాతావరణంలో కావచ్చు.

➡ తమ ఆశయానికి సరిపోయే సంస్థలోనే పనిచేయడానికి ఇష్టపడతారు. కంపెనీ విధానాలూ విలువలూ తెలుసుకుంటారు. -ఉద్యోగంలో చేరితే జీవితంలో సెటిలైపోయినట్లే అనుకోరు. ఎప్పటికప్పుడు పనిలో నైపుణ్యాలను పెంచుకుంటారు.

➡ సోషల్‌మీడియాని కాలక్షేపానికి కాక, విషయాలు తెలుసుకోవడానికి వాడతారు.

# వానాకాలం వచ్చింది



వొళ్లంతా పగుళ్లతో
ఎండకు కలిగిన తాపంతో నేల!
విరహంతో వేచి చూసే ప్రేయసికి
మధుమాసపు కోకిల గానంలా!
పగుళ్లపై వెన్న పూసినట్లుగా
తీపి పలుకులా
తొ ల క రి
జల్లులు!
చిరునవ్వులుగా కురిసిన
చినుకులు
తడచి తన్మయత్వంతో పుడమి!
పులకించి విత్తనాన్ని కౌగలించుకొని
ప్రసవించిన పంటచేళ్లు
పచ్చదనం నేలన కుప్ప పోసినట్లు
ప్రకృతి పిల్లపడుచై పైట వేసుకున్నట్లు!
ఆనందమంతా అవనిపై ఆరపోసినట్లు
నేలపై గంధం తీసినట్లు కమ్మని వాసనలు
సొమ్మసిల్లిన రైతుకు
రొమ్ము విరుచుకున్న చైతన్యం!
అమ్మ పొదుగున పాలధారకు
మురిసిపోయిన లేగల్లా
ఊళ్లన్నీ సాగుకై కసరత్తులు
పనులతో రైతులు కవాతులు!
నాగళ్లతో భూమి సాల్లలో
సంతోషాలు పండించాలని
రైతన్న కూలన్న కూడబలుక్కున్నట్లు
సంకల్పంతో నడుము బిగించి!
అప్పడాల గుజ్జాలు అశ్వాలై పరుగులు
నేనున్నాను నారు పోసుకో అని నీరు
దుక్కులన్నీ పూర్తి చేసుకొని చేళ్ల
సిద్ధమయ్యే నలు దిక్కులన్నీ.
ఎండుదిబ్బలు పచ్చలాంతర్లయి
ప్రకృతి అంతా పచ్చ వెలుగులు
రైతు ముఖాన పూసిన నవ్వులు
రేపు పండబోయే సిరుల పంటలు!!

**- జగ్గయ్య. జి**

---

# వికాస గమనము

జీవన గమనమంతా
ఎదురయ్యే ఒడిదుడుకులెన్నో
అడ్డూ అదుపు లేకుండ
సమయాన్నంతా వృథాగా
ఖర్చు చేయకు
కలకాదిది నిజం
వేసే ప్రతి అడుగు ఆలోచనతోనే
ఆవేశానికి తావియ్యక
అందరితో కలవాల్సి ందే.

బంధాలు బలంగా
మనసంతా అల్లుకుపోవాల్సి ందే
మేమున్నామంటూ
చేయూతకై
చెలిమికి ద్వారం తెరవాల్సి ందే.

ఆకాశమంత మనసుతో
భూదేవి పరవశించేలా
స్వాగత గీతం పాడాల్సి ందే
విశ్వవీధిలో వినయాభరణంతో
విజయమందుకోవాల్సి ందే
ఎదుటోళ్లలో సైతం కోరుకోవాల్సి ందిదే.
ఉక్కుసంకల్పంతో ఊహాలోకానికి రూపమియ్యాల్సి ందే
తరగని తేజస్సుతో సూర్యునిలా వెలుగియ్యాల్సి ందే
అది ఆదర్శంగా
పరులకది ప్రేరణవ్వాల్సి ందే
జ్ఞాన ప్రవాహంలో కాసింతైనా
దోసిళ్లతో మనసు నింపుకోవాల్సి ందే
నిన్ను నువ్వే జయించే భవిష్యత్తుకు ధైర్యమవ్వాల్సి ందే.


**- సి.శేఖర్(సియసార్)**



# ఈవారం కవిత్వం

## పుస్తక సమీక్ష

### 'విప్లవ వీచిక 'కొత్తగాలి'



నాలుగు దశాబ్దాలుగా పీడిత ప్రజల పక్ష వేదనలు కవిత్వంగా ఒక నిబద్ధతతో వినిపించే అడిగోపుల వారి 27వ కవితా సంపుటి ఇది. డా॥పి.సి.వెంకటేశ్వర్లు చక్కటి ముందు మాట రాశారు. వారన్నది అక్షరసత్యం. 'అభ్యుద యానికి, అభివ్యక్తికి, శాశ్వత చిరునామా అడిగోపుల వెంకటరత్నమ్ అనడంలో అతిశయోక్తి లేదు. ఈ సంపుటిలో 62 కవితలున్నాయి. కుందేళ్ల ఎదురు తిరిగిన చారిత్రక సత్యమే విజయనగర సామ్రాజ్యమైంది. పీడింపబడిన వాళ్ల పిడికిలి బిగించి ఎదిరిస్తే అది రష్యా, చైనా, క్యూబా, వియత్నంలైనాయి. పులిని జింక పిల్లల చేత తరిమిం చటమనే పచ్చటి ముఖచిత్రం ఈ పొత్తంలోని కవిత్వాన్ని అర్థం చేసుకొనెందుకు అద్దంగా అర్థంగా నిలుస్తుంది. కవిగా ఆయన ఏం ఆశిస్తున్నాడో స్పష్టంగా సూటిగా ప్రతి కవితలో చెప్పారు అడిగోపుల వారు. అంతర్జాతీయ దృక్పథం తెలిపే 'కాలం చిగురిస్తుంది' కవితలో కవి ఓ చోట ఇలా అంటాడు 'చక్రం తయారీదారుడు భూగోళాన్ని బండికెక్కించి అమ్మకం ఆరంభించాడు. చేజిక్కిన ప్రపంచం చేజారిపోకుండా బంధనం' (పేజి.42) అంటాడు. మార్కెట్ వినిమయ ప్రపంచాన్ని వేలెత్తి చూపుతూ ఆశావహంతో చివర ఇలా రాస్తారు 'కాలం చిగురులు వేస్తుంది చిగురు మారాకైతే మరో చిగురును రెమ్మ ప్రసరిస్తుంది' అంటారు. తిరగబడలేని మనిషిపై 'మౌనం కప్పుకున్న మనిషి' అనే కవితలో చివరి వాక్యాల్లో ఆవేదనపడతారు.'అధర్మం రాజ్యాధికా రమై రాజ్యమేలుతుంటే తన్ను నిమజ్జనం చేసుకున్న మనిషి ఉద్యమమై దూకక భీరువై తలవంచటం చూసి అగ్ని నిశ్చేష్టమైంది' (పేజి 75) యుద్ధోన్మాదంపై యుద్ధం ముగిసాక అనే కవితలో చివరి వాక్యాలు తాత్వికతతో నిండి వున్నాయి. ఓ ప్రగతిశీల కవిత్వం సంపుటి ఇది. అభినందనలు.

**(కొత్తగాలి, రచన: వెంకటరత్నమ్, వెల: రూ 150, ప్రతులకు: కావే రెసిడెన్సీ, అరవింద్ మార్గ్, ఎన్జీవో కాలనీ, తిరుపతి)**

**- తంగిరాల చక్రవర్తి**

### 'ఊరగాయలు ఊరించే పచ్చళ్లు'



ఈ కాలం అమ్మాయిలకి ఒక అమ్మ, అత్త, పిన్ని, అమ్మమ్మ, నాన్నమ్మలా ఊరగాయలు, ఊరించే పచ్చళ్ల తయారు చేయటం నేర్పటం కోసం చెంగల్వల కామేశ్వరి 'ఊరగాయలు-ఊరించే పచ్చళ్లు' ఆస్వాదింపచేసారు. తెలుగునాట గృహిణులను 'వంటింటి మహారాణి', 'అన్నపూర్ణమ్మ తల్లి', 'కిచెన్ క్వీన్' వంటి పొగడ్తలతో ప్రశంసించడానికి అవసరమైన రుచులన్నీ ఈ పుస్తకంలో వున్నాయి. తెలుగువారికి అత్యంత ప్రీతిపాత్రమైన ఊరగాయల తయారీతో పాటుగా ఊరించే పచ్చళ్లు కూడా నోరూరిస్తూ చదివింప చేస్తున్నాయి. రుచికరంగా తినడం, చక్కగా వండిపెట్టడం, ప్రేమగా తినిపించడం నేర్పిన అమ్మ అడుగుజాడలలో చెంగల్వల కామేశ్వరి ఎంతో ఆసక్తితో 60 ఆవకాయలు, 40 రోటి పచ్చళ్ల తయారీ విధానాలను స్పష్టంగా, ఆచరించదానికి అనువైన మాటలతో గ్రంథస్థం చేసారు. తెలుగునాట ప్రతి వంటగదిలో, గృహిణులకు అందుబాటులో వుండవలసిన పుస్తకం అనటంలో సందేహం లేదు.

**(ఊరగాయలు-ఊరించే పచ్చళ్లు, రచన: చెంగల్వల కామేశ్వరి, వెల: రూ 130, ప్రతులకు: ప్లాట్: 106, రాయల్ రెసిడెన్సీ, అల్వాల్, సికింద్రాబాద్)**

**- యర్రమిల్లి**

### బడుగు బ్రతుకుల జీవితచిత్రణ

డా॥వి.ఆర్. రాసాని ఈ నవల 'మట్టిబతుకులు' 1995లో చతుర మాసపత్రిక వారు నిర్వహించిన పోటీలో బహుమతి పొందినది. ఇది రెండవ ముద్రణ. దాదాపు 30 ఏళ్ల కిందట గ్రామీణ వాతావరణం, ఊరి పెద్దలు తమ స్వార్థానికి కింది జాతి వారిలో అనైక్యత సృష్టించి ఎలా వాడుకుంటారో వివరించబడింది. నాటి 'బసివిని' ఆచారం ఇప్పుడు అంతరించిపోయిందనే చెప్పాలి. ఇది తప్పితే, రాసానిగారి ఈ నవలలో వివరించిన పరస్పర కక్షలు కార్పణ్యాలు ఒక వర్గాన్ని మరొకరు తక్కువ చేసి చూడటం గ్రామపెద్దలు కలహాలు రాజేసి లబ్ది పొందటం ఇంకా ఉందనే చెప్పాలి. చిత్తూరు జిల్లాకు చెందిన 'కురవపల్లి' అనే గ్రామం, పరిసరాలను నేపథ్యంగా వాడుకున్నారు రచయిత. కూలీపని చేసుకునే రెండు వర్గాల్లో ఒక వర్గం యువకుడు శివదాసు ఈ నవలకు నాయకుడు. మరో వర్గానికి చెందిన మాతంగి అనే యువతి, పరస్పరం ప్రేమించుకుంటారు. వరదయ్య అనే అగ్రవర్ణపు భూస్వామి ఈ రెండు వర్గాల వారి ధనమాన ప్రాణాలను దోచుకుంటుంటాడు. మాతంగిపై కన్నువేసి విఫలుడై ఆమెను బసివిని చేస్తాడు. బాలకిష్టుడు అనే పిల్లవాడు వరదయ్య కల్తీ సారాకు బలైపోతాడు. శివదాసు ఇటుకబట్టిలో ఆయన అన్న శవం కనిపిస్తుంది. వరదయ్యే చంపిస్తాడు. అన్యాయాలు అక్రమాలతో



విసిగిపోయిన రెండు వర్గాల వారు ఏకమై వరయ్యను హతమార్చటంతో నవల ముగుస్తుంది. ఈ నవలలోని పాత్రలు సంఘటనలు బావిపూడిక తీయటాలు, ఎలుకల్ని పట్టటం, పందుల్ని పెంచటం లాంటివి అతిసహజంగా వర్ణించారు. సందర్భోచిత వర్ణనలు, ప్రతీకలు, ఉపమానాలు, దృష్టాంతరాలు నవలను మరింత ఔచితీమంతంగా తీర్చిదిద్దటానికి తోడ్పడ్డాయి. తప్పక చదవాల్సిన, గొప్ప సాహితీ విలువలు గల నవల.

**(మట్టి బతుకులు, నవల, రచన: డా॥వి.ఆర్.రాసాని, వెల: రూ150, ప్రతులకు: అన్ని ప్రముఖ పుస్తక కేంద్రాలు)** **- కూర చిదంబరం**



# మనసును దోచే విడిది

**ఆతిథ్యరంగమంటే అభివృద్ధి చెందిన దేశాలే గుర్తొస్తాయి. విలాసవంతమైన హోటళ్లు అంటే పాశ్చాత్య దేశాలే కళ్లముందు కనబడతాయి.**

కానీ ఆ లగ్జరీ హోటళ్లన్నింటినీ తలదన్ని మొదటిస్థానంలో నిలబడిన రామ్‌బాగ్ ప్యాలెస్ ఒకప్పుడు రాజసౌధం. కాలక్రమేణా లగ్జరీ హోటల్‌గా మారి మనదేశంలోని మొట్టమొదటి ప్యాలెస్ హోటల్‌గానూ ప్రసిద్ధి చెందింది. ఆ హోటల్‌లో అడుగడుగునా భారతీయ వాస్తు, సాంస్కృతిక, వారసత్వ సౌందర్యం ఉట్టిపడుతుంది. భవనం నిర్మాణం నుంచి లోపలి అలంకరణ దాకా ప్రతిదీ ప్రత్యేకమే. విలాసవంతమైన గదులు, కళ్లు మిరుమిట్లు గొలిపే షాండ్లియర్లు, దేశవిదేశాల్లో ప్రసిద్ధి చెందిన కమ్మని వంటకాలు ఒక్కసారి వెళ్తే మళ్లీమళ్లీ రమ్మంటూ ఆహ్వానం పలుకుతుంటాయి.

**ప్రేమ కానుక:** రామ్‌బాగ్ ప్యాలెస్ కొలువుతీరిన ప్రాంతం ఒకప్పుడు అందమైన అటవీ ప్రదేశం. 1835లో మహారాజా రామ్ సింగ్-2 అర్ధాంగి తనకు ఇష్టమైన చెలికత్తె కేసర్‌కోసం నగరానికి దూరంగా ఓ భవనాన్ని కట్టించి ఇచ్చింది. ఆ చెలికత్తె మరణానంతరం మహారాజు ఆ భవనాన్ని స్వాధీనం చేసుకొని కొన్ని మార్పులు చేయించాడు. వేటకు వెళ్లినప్పుడు విశ్రాంతి మందిరంగా దాన్ని ఉపయోగించుకోవడం మొదలుపెట్టాడు.



క్రమంగా ఆ భవనానికి రామ్‌బాగ్ అనే పేరు వచ్చింది. కొన్నేళ్లకు అదే వంశానికి చెందిన మహారాజా మాన్‌సింగ్-2 రామ్‌బాగ్‌ను తన ప్రధాన నివాసంగా చేసుకుని 1931లో ఆ భవనాన్ని రాజమందిరంగా విస్తరించి తన భార్య అయిన మహారాణి గాయత్రీదేవికి ప్రేమకానుకగా అందించాడు.

**లగ్జరీ హోటల్‌గా**

విశాలమైన ఈ భవనం నిర్వహణ కష్టంగా మారడంతో 1957లో రామ్‌బాగ్ ప్యాలెస్‌ను లగ్జరీ హోటల్‌గా మార్చారు. 1972లో తాజ్ గ్రూప్ దీన్ని కొనుగోలు చేసి మరిన్ని హంగూ ఆర్భాటాలతో అద్భుతమైన హెరిటేజ్ హోటల్‌గా తీర్చిదిద్దింది. 47 ఎకరాల విస్తీర్ణంలో 104 గదులుగా ఉన్న కోటను 79 విశాలమైన గదులుగా మార్చింది. కోటలోపల మరమ్మతు చేసి మీనాకారి, థీక్రిలాంటి కళలతో బంగారు రేకులతో గోడల్నీ సీలింగ్‌నీ అలంకరించింది. పందిరి మంచాలు, పెయింటింగులు, అద్దాలు, రంగులదీపాలు, జర్దోసీ వర్కు చేసిన ఫర్నిచరుతోపాటు ఆనాటి రాజులు విరివిగా వాడే అంతర్జాతీయ బ్రాండెడ్ ఉత్పత్తుల్నీ గదుల్లో అమర్చింది. ప్రతిసూట్‌లోనూ రాజస్థానీ పాలరాతి సోయగం, కళానైపుణ్యం ప్రతిబింబించేలా తీర్చిదిద్దింది.


స్మార్ట్ టీవీ, వైఫై, ల్యాప్‌టాప్, ఫ్రిజ్, మినీబార్, విలాసవంతమైన స్నానాల గది, ..ఖరీదైన ఫర్నిచర్, ఎటు చూసినా మిరుమిట్లు గొలిపే షాండ్లియర్ల గురించి ప్రత్యేకంగా చెప్పనక్కర్లేదు. రాజభవనంలో సదుపాయాలూ, అలంకరణను బట్టి ప్యాలెస్ రూమ్‌లు, హిస్టారికల్, రాయల్,



గ్రాండ్ రాయల్, గ్రాండ్ ప్రెసిడెన్షియల్ సూట్స్‌గా విభజించారు. గ్రాండ్ రాయల్ సూట్స్ విభాగంలో మాత్రం మహారాణి సూట్స్, ప్రిన్స్‌సూట్ అని రెండు ఉన్నాయి. ఒకప్పుడు గాయత్రీదేవి వాడిన గదే మహారాణి సూట్, ప్రిన్స్‌సూట్ అని రెండు ఉన్నాయి. అద్దాలూ, రంగురాళ్లూ పొదిగిన గోడలూ, ఖరీదైన ఫర్నిచర్‌తోపాటు అందమైన రాజస్థానీ పెయింటింగులతో ఎంతో ఆకర్షణీయంగా ఉంటుంది. గాయత్రీదేవి కొడుకు జగత్‌సింగ్ వాడిన గదే ప్రిన్స్‌సూట్. మహారాణి సూట్‌కి ఏమాత్రం తక్కువకాకుండా మరింత ఆధునిక హంగులతో ఉంటుంది. ఇక్కడ లాంజ్‌లో కూర్చుంటే ఉద్యానవనంలో అందాల్నీ, పచ్చిక బయళ్లలో పురివిప్పి నాట్యమాడే నెమళ్ల సొగసుల్నీ హాయిగా వీక్షించొచ్చు. అలానే గ్రాండ్ ప్రెసిడెన్షియల్ సూట్ విభాగంలో సూర్యవంశీసూట్, సుఖ్‌నివాస్ సూట్ అని రెండు ఉన్నాయి. సూర్యవంశీసూట్‌లో ఆకుపచ్చని ఉదయ్‌పూర్ రాళ్లతో నిర్మించిన ఆర్చ్‌లతో కూడిన సీలింగ్‌లు రాజపుత్రుల వైభవాన్ని కళ్లకు కడతాయి. రెండోది సుఖ్‌నివాస్..క్రిస్టల్ షాండ్లియర్లు, బంగారురేకులతో అలంకరించిన ఈ సూట్ ఎవరినైనా ఇట్టే ఆకట్టుకుంటుంది. అక్కడ అద్దాల బాత్‌రూమ్‌తోపాటు విశాలమైన లాంజ్, డైనింగ్‌హాల్ వంటి సదుపాయాలలో రాజసం ఉట్టిపడుతుంటుంది.

### ఆధునిక వసతులూ

ఫోలో మైదానం, జిమ్, స్పా, యోగా కేంద్రంతోపాటు..ఎన్నో అత్యద్భుత సౌకర్యాలతో రామ్‌బాగ్ అతిథులకు సేవలందిస్తోంది. పెద్దపెద్ద కాన్ఫరెన్స్ హాళ్లతో బిజినెస్ మీటింగులకు వేదికగా మారి కేఫేలూ, రెస్టరంట్లతో కార్పొరేట్



ప్రపంచానికి స్వాగతం పలుకుతోంది. అలానే డెస్టినేషన్ వెడ్డింగ్‌లకూ వేదికై వధూవరుల జీవితాల్లో మరిచిపోలేని ఎన్నో మధురఘట్టాలకు నెలవుగా మారింది. ప్యాలెస్‌లో 20-2000 మంది వరకూ పట్టే పలు వేదికలు అందుబాటులో ఉన్నాయి. డెస్టినేషన్ వెడ్డింగ్ కోసం తీసుకెళ్లే అతిథుల సంఖ్యనూ ఎంచుకునే అలంకరణనూ విందునూ బట్టి రోజుకు దాదాపు రూ.60 లక్షల నుంచి కోటి వరకూ ఛార్జ్ చేస్తారు. మరి రాజభవనాల్లో విడిది అంటే ఆ మాత్రం ఉండదా అంటే అక్కడ గడిపే ప్రతిక్షణం అద్భుతంగానూ విలువైందిగానూ చెబుతారు బస చేసిన అతిథులు. ఒక్కసారైనా ఆ రాజరిక మర్యాదల్లో తడిసిముద్ద వ్వాల్సిందేనంటారు. ❑




## రచనలకు ఆహ్వానం

రచయితల నుండి కథలు, కవితలు, సమకాలీన వ్యాసాలు స్వాగతిస్తున్నాం.
రచనలతో పాటు మీ పేరు, చిరునామా, హామీపత్రం తప్పనిసరిగా జతచేయాలి.
ఎంపిక కాని రచనలు తిప్పి పంపగోరేవారు తగిన పోస్టేజీ జత చేసిన కవరు పంపించాలి. ఇతర పత్రికల పరిశీలనలో ఉన్న రచనలు పంపించకండి.
రచనలు పంపించాల్సిన చిరునామా: **ఎడిటర్,**
**ఆదివారం వార్త,** నం.396,
లోయర్ ట్యాంక్ బండ్, డిబిఆర్ మిల్స్ పక్కన, హైదరాబాద్-80.
sunmagvaartha@gmail.com

కథ

# తేజ-పూజ

ఆదివారం సాయంత్రం. సమయం నాలుగు గంటలు. ఆ ఊరి మధ్య ఉన్న స్తంభం దగ్గరకు జనాలు రావటం మొదలయ్యారు. కాసేపట్లోనే అక్కడ పిల్లలు, పెద్దలు చాలామందే పోగయ్యారు. ప్రతీ ఆదివారం ఇంతే! రెండు నిమిషాల్లో ఆట మొదలవుతుంది. రాము, వాళ్లనాన్న ఇద్దరూ సిద్ధంగా ఉన్నారు. అందరి కళ్లు తేజ అనే కోతివైపే ఉన్నాయి. దానికి రామునే తేజగా నామకరణం చేశాడు. చూస్తుండగానే తేజ ఆ పొడవాటి స్తంభం ఎక్కి అందరికీ దణ్ణం పెట్టింది. ఆట మొదలైంది. రాము డబ్బు వాయిస్తుంటే తేజ గెంతుతూ డాన్స్ చేసింది. నల్ల కళ్లద్దాలు సవరించుకుంటున్న మనిషి దగ్గరకు వెళ్లి ఆ కళ్లద్దాలు తన కళ్లకు తగిలించుకుని ఫోటోలకు ఫోజులిచ్చింది. తేజ చేష్టలకు అక్కడున్న పిల్లలు సంతోషంతో చప్పట్లు కొడుతున్నారు. అవ్వ చేతిలో ఉన్న చేతి సంచి తీసుకుంది. సంచి భుజాన వేసుకుని వయ్యారంగా అటుఇటు నడిచింది. ఆ నడక చూసి అక్కడున్న వాళ్లు పొట్ట చెక్కలయ్యేలా నవ్వుతున్నారు. తరువాత ఆ సంచి మర్యాదగా అవ్వ చేతిలో పెట్టి దణ్ణం పెట్టింది. అవ్వ తన సంచిలో పండు తీసి తేజకు ఇచ్చింది. అప్పటికే ఆకలిగా ఉన్న తేజ ఆ పండును వెంటనే తినేసింది. మిగతా వాళ్లు కూడా తేజకు తమ దగ్గర ఉన్న తినుబండారాలు ఇవ్వడం మొదలుపెట్టారు. అన్నీ తీసుకుపోయి రాము చేతిలో పెట్టింది. తరువాత రాము తన సంచి తీసుకుని వెళ్తే అందరూ తలా కొన్ని పైసలు అందులో వేశారు. పూజ అనే ఒక పాప మాత్రం తన దగ్గర ఉన్న పుస్తకాల్లో ఒకటి రాముకు ఇచ్చింది. రాము ఆనందం అంతా ఇంతా కాదు. అలా ఆ రోజు ఆట ముగిసింది.



రాము ఇంటికి వెళ్లగానే ఆ పాప తనకు ఇచ్చిన పుస్తకాన్ని తీశాడు. రాముకు చదువంటే ఎంతో ఇష్టం. కానీ చదువుకునే అవకాశం లేక నాలుగో తరగతిలోనే చదువు ఆపేశాడు. తేజను ఆడిస్తేనే వాళ్లకు ఆకలి తీరేది. చుట్టుపక్కల ఊర్లన్నీ తిరిగే వాళ్లకు ఒక చోట బడికి వెళ్లడం కుదరని పని. ఇవాళ రాము చాలా ఆనందంగా ఉన్నాడు. తనకు ఆ పాప పుస్తకం ఇచ్చింది. అది కూడా బొమ్మల కథల పుస్తకం. తనకు ఎంతో ఇష్టమైనది. రాము పుస్తకం తీయగానే తేజ కూడా రాము మీద ఎక్కి కూర్చుంది. పుస్తకంలో బొమ్మలు తన లాగా ఉండటం చూసి కళ్లు పెద్దవి చేసి చూస్తోంది తేజ. మొదటి పేజీలో చిన్న కోతిపిల్ల చెట్టు కొమ్మ మీద కూర్చుంది. పక్క పేజీ తిప్పగానే ఇంకొక కోతిపిల్ల వచ్చి దాని పక్కన కూర్చుంది. మూడవ పేజీలో రెండూ కలిసి ఆడుకుంటున్నాయి. అవి రెండూ అడవిలో తిరుగుతూ ఇంకో నాలుగు కోతుల్ని కలిసాయి. పుస్తకం చివరకు వచ్చేసరికి కోతుల గుంపు అంతా కలిసి ఒకదాని వెనుక ఒకటి నడుస్తూ ఎక్కడికో వెళ్తున్నాయి. ఒక కుటుంబం లాగా!

పుస్తకం అయిపోయాక రాము తేజ వైపు చూశాడు. తేజ చిన్న పిల్లగా ఉన్నప్పటికి నుండి వాళ్ల దగ్గరే ఉంది. అంతలోనే తేజ పుస్తకం తెరిచి ఆఖరి పేజీ చూస్తోంది. దాని బాధ రాముకు తెలిసింది. నాన్నతో మాట్లాడి, మరునాడు తేజను ఊరికి దూరంగా ఉన్న అడవిలో వదిలేసి వచ్చాడు.

**- డాక్టర్ హారిక చెరుకుపల్లి**

# తెలుగు వెలుగు ... / వార్త ఆదివారం


## బాలగేయం

### నా రామా చిలుక



చిట్టిపొట్టి చిలక
నా రామ చిలక
ఏందమ్మ అలక
వచ్చిందా ఎలుక
తీసుకెళ్లిందా గిలక
పిల్లికి చెపుదామా
ఇంతలో వచ్చింది ఎలుక
తెచ్చింది గిలక
చెప్పింది సారీ
నవ్వింది చిలక
మానింది అలక
హాయిగా ఆడుకొంది
నా రామ చిలుక

**- యస్.జేచంద్రారెడ్డి,**
బాపట్ల



## హలో ఫ్రెండ్...


చిన్నారుల ప్రశ్నలకు
వార్త సిఎండి, మేనేజింగ్ ఎడిటర్
## గిరీష్ అంకుల్ సమాధానాలు

**- కె.ఆకాశ్,** పాల్వంచ

ప్రశ్న: గిరీష్ సంఘీ అంకుల్ గారికి నమస్తే. పండ్లు త్వరగా ఎలా పండుతాయి?



**జవాబు: ఆకాశ్!** సాధారణంగా పండ్లలో 'ఇథిలీన్' అనే వాయువు ఉత్పత్తి అవుతుంటుంది. ఆ వాయువే పండ్లు బాగా పండేందుకు కారణమవుతుంది. పండ్ల రకాలను అనుసరించి ఈ వాయువు వివిధ స్థాయిలలో ఉంటుంది.
ఉదాహరణకు అరటిపండ్లలో చాలా తక్కువ స్థాయిలోనూ, ఆపిల్స్‌లో ఎక్కువ స్థాయిలోనూ ఈ వాయువు ఉంటుంది. మామిడి పండ్లను, ఇతర రకాలనూ త్వరితంగా పండించేందుకు కృత్రిమంగా (ఊదరపెట్టడం ద్వారా) ఇథిలీన్ వాయువును ఉపయోగించేందుకు రసాయనాలు వాడుతున్నారు. ఈ రసాయనాల ద్వారా ఇథిలీన్ వాయువు పుట్టి ఆ పండ్లను త్వరగా పండించడం ద్వారా వాటిని తింటే అనారోగ్యం కలుగుతుంది. ప్రకృతి సహజంగా పండినవే ఆరోగ్యానికి క్షేమకరం. ఆపిల్ పండ్లతో కలిపి వుంచితే ఏర్పడిన పండుదనం కొంతలో కొంత మేలు. సాధారణంగా అరటిపండ్లు చాలా త్వరగా పండుతాయనే ఉద్దేశంతో కొంచెం పచ్చిగా ఉండగానే కొంటుంటాం. అయితే బాగా పచ్చిగా ఉన్న అరటిపండ్లలో కొన్నింటిని విడిగా వుంచి, మరికొన్నిటిని ఆపిల్స్‌తో కలిపి బుట్టలో వుంచండి.



మరుసటి రోజు పరిశీలిస్తే విడిగా వున్న పండ్లు ఏమీ మార్పు లేకుండా గట్టిగా, ఆకుపచ్చ రంగులోనే ఉంటాయి. ఆపిల్స్‌తో కలిపి వుంచిన పండ్లు మాత్రం పసుపుపచ్చ రంగులోకి మారి పండి వుంటాయి.



# పొట్టకు మేలైన ఆహారం

ఆకలి ఉన్నా లేకపోయినా, మంచివైనా కాకపోయినా పొట్టలోకి అదే పనిగా ఏదో ఒకటి పంపిస్తుంటారు కొందరు. అయితే, ఆ ఆహారం ప్రభావం ప్రధానంగా మెదడు మీద పడుతుంది. అది అదుపు తప్పితే ఆందోళన కలిగిస్తుంది. ఏకాగ్రతను చెడగొడుతుంది. మొద్దుబారేలా చేస్తుంది. మరిపొట్ట ఆరోగ్యంగా ఉండాలంటే..

➡ పొట్టలో లక్షల సంఖ్యలో బ్యాక్టీరియా, వైరస్, ఫంగస్..లాంటి సూక్ష్మజీవులు ఉంటాయి. వాటిలో మంచివీ ఉంటాయి. అమెరికన్ గట్ ప్రాజెక్ట్ పరిశోధన ప్రకారం వారంలో 30 రకాల కూరగాయలూ, ఆకుకూరలూ, పండ్లూ తీసుకుంటే పొట్టలో మేలుచేసే సూక్ష్మజీవులకి మంచిది.

➡ మంచి బ్యాక్టీరియా రోగనిరోధక శక్తిని పెంచుతాయి. ఒత్తిడిని తగ్గిస్తాయి. స్థూలకాయాన్ని తగ్గిస్తాయి. ఇవి విటమిన్-కె, షార్ట్-చెయిన్ ఫ్యాటీ ఆమ్లాల (ఎస్సీఎఫ్ఏ) ఉత్పత్తికి సాయపడతాయి. ఈ ఎస్సీఎఫ్ఏలే పెద్దపేగు పనితీరులోనూ కీలకం. పొట్ట-మెదడు మధ్య సమాచార మార్పిడిలోనూ వీటి పాత్ర ప్రధానం.


➡ మంచి బ్యాక్టీరియా కోసం పెరుగు, మజ్జిగలతోపాటు పులియబెట్టిన పిండితో చేసే ఇడ్లీ, దోశ, ధోక్లాలాంటివీ తీసుకోవచ్చు. ఈ తరహా బ్యాక్టీరియా పెరుగుదలకు అవసరమయ్యే పదార్థాలు అరటి, ఆపిల్, ఓట్స్, ఉల్లి, వెల్లుల్లిలో ఎక్కువగా ఉంటాయి.

➡ ఆహారాన్ని నిల్వ చేసేందుకూ, రంగూ కోసమూ, పురుగుమందుల నివారణకూ వాడే రసాయనాలవల్ల పొట్టలో మంచి బ్యాక్టీరియా చనిపోతుంది.

➡ మద్యం ఎక్కువగా తీసుకున్నా అది మంచి బ్యాక్టీరియాని చంపేస్తుంది. మితాహారం, క్రమమైన ఉపవాసాలూ, వ్యాయామాలు పొట్టకి మేలు చేస్తాయి.

# అప్రమత్తం చేస్తుంది

రోడ్డుమీద పరధ్యానంగా నడవటం క్షేమం కాదు. ఎక్కడ్నుంచి ఏ వాహనం వచ్చి ఢీకొడుతుందో తెలియదు. ముఖ్యంగా రోడ్డు దాటే చోట మరింత అప్రమత్తంగా ఉండటం మంచిది. ఇప్పుడు చాలామంది చేతిలో ఫోన్లు పట్టుకొని, వాటిని చూస్తూ నడవటం ఎక్కువైంది. దీంతో ప్రమాదాల బారినపడే వారి సంఖ్యా పెరిగింది. ఎంతోమంది ప్రాణాలనూ కోల్పోతున్నారు. ఈ సమస్యను పరిష్కరించటానికి యూనివర్సిటీ ఆఫ్ అలబామా పరిశోధకులు వినూత్న స్మార్ట్‌ఫోన్ యాప్‌ను రూపొందించారు. దీని పేరు స్ట్రీట్‌బిట్. పాదచారుల రక్షణలో ఇది గొప్ప మార్పు తీసుకురాగలదని భావిస్తున్నారు. బ్లూటూత్ రేడియో ట్రాన్స్‌మిటర్ (బీకన్) సాయంతో పనిచేస్తుంది. ఈ బీకన్లను అమర్చిన మూల మలుపుల వద్దకు పాదచారులు వచ్చినప్పుడు స్మార్ట్‌ఫోన్‌కు హెచ్చరిక సంకేతాలు పంపుతుంది. ఇలా రోడ్డు మీద దృష్టి సారించేలా చేస్తుంది. ప్రమాదాల నివారణకు తోడ్పడుతుంది. ప్రస్తుతం అందుబాటులో ఉన్న సాధనాలతోనే దీన్ని వాడుకోవచ్చని, తాము రూపొందించిన టెంప్లేట్‌ను పెద్ద ఎత్తున ఉపయోగించుకోవచ్చని పరిశోధకులు చెబుతున్నారు. ప్రమాదాల నివారణకిది చవకైన మార్గంగా తోడ్పడగలదని ఆశిస్తున్నారు.



రైలు ప్రమాదంలో అతడు రెండు కాళ్లు కోల్పోయాడు. అతని అన్న ఆర్థిక ఇబ్బందులను భరించలేక ఆత్మహత్య చేసుకున్నాడు. చుట్టూ ప్రతికూల పరిస్థితులు ఉన్నా, తన లక్ష్యం మాత్రం మరువలేదు. పట్టుదల, కృషి ఉంటే అంగవైకల్యం అవరోధం కాదని నిరూపిస్తూ ఐఎఎస్‌ను సాధించాడు. అతడే సూరజ్‌తివారీ. ఉత్తరప్రదేశ్‌కు చెందిన సూరజ్‌తివారీ అందరి యువకుడిలా అందమైన భవిష్యత్తు కోసం కలలు కన్నవాడే. ఒకరోజు అనుకోని ఉపద్రవం ఎదురైంది అతనికి. ప్రైవేటు కంపెనీలో పనిచేసే సూరజ్..నోయిడాలో రద్దీగా ఉన్న రైలు ఎక్కుతూ కాలుజారి పడిపోయాడు. కొద్దిరోజుల తర్వాత స్పృహ వచ్చి చూస్తే ఢిల్లీ ఎయిమ్స్‌లో ఉన్నాడు. రెండు కాళ్లూ, కుడిచేయీ, ఎడమ చేతి రెండు వేళ్లూ పూర్తిగా పోయాయి. ఈ సంఘటన 2017



# అడ్డంకులు ఎన్నైనా ఐఏఎస్ సాధించాడు

జనవరిలో జరిగింది. మూడునెలలు హాస్పిటల్ బెడ్‌పైనే ఉన్నాడు. 'ఆ ప్రమాదంలో చనిపోవాల్సిందే. కానీ బతికాను. కాబట్టి ఈ జీవితానికి ఏదో పరమార్థం ఉండాలనుకున్నా' అంటాడు సూరజ్. అంతకుముందే ఇంట్లో పరిస్థితులు కారణంగా ఇంటర్‌తోనే చదువు మానేసి ఉద్యోగంలో చేరాడు. సూరజ్‌కి ఓ అన్నయ్య తమ్ముడు, చెల్లి. సూరజ్ చికిత్స కోసం చేసిన అప్పులతో ఆ కుటుంబ ఆర్థిక పరిస్థితి మరింత దిగజారింది. భవిష్యత్తు గురించి భయపడ్డాడేమో సూరజ్ అన్నయ్య ఆత్మహత్య చేసుకున్నాడు. అంతటి నిరాశావహ పరిస్థితుల్లోనూ సూరజ్ బెదిరిపోలేదు. ఢిల్లీ ఏఎన్‌యూలో చదువుతున్న స్నేహితుడి సలహాతో అక్కడ చదువు కొనసాగించాలనుకున్నాడు. అతడు చెప్పినట్టు ప్రవేశపరీక్షకు సిద్ధమయ్యాడు. అయినా సీటు రాలేదు. ఆ సమయంలో తొమ్మిది నెలలు ఇంటి దగ్గరే ఉన్నాడు సూరజ్. పరామర్శకు వచ్చినవాళ్లంతా 'ఎలా బతుకుతాడో ఏంటో' అనేవారు. ఆ మాటలు సూరజ్‌లో 'గొప్పగా బతికి చూపించాలన'్న పట్టుదలని మరింత పెంచాయి. రెండో ప్రయత్నంలో జేఎన్‌యూ (బీఏ)లో సీటు సంపాదించి 2018లో క్యాంపస్‌లో అడుగుపెట్టాడు.

జేఎన్‌యూలో సూరజ్‌కి ఉదయం పూట క్లాసులయ్యేవి. మధ్యాహ్నం లైబ్రరీకి వెళ్లడం అలవాటైంది. అక్కడ సివిల్స్‌కి సిద్ధమవుతున్న వాళ్లని చూశాడు. తానేం సాధిస్తే సమస్యలన్నీ పరిష్కారమవుతాయో అర్థమైంది సూరజ్‌కి. సివిల్స్ లక్ష్యంగా పెట్టుకున్నాడు. సూరజ్ తపనని చూసి స్నేహితులూ, ప్రొఫెసర్లూ చేయూతనందించేవారు. మొదట్లో సాధారణ వీల్‌చైర్‌లో తిరిగేవాడు. అలాంటప్పుడు రూమ్మేట్స్ సహకరించేవారు. తర్వాత ఓ ఎన్జీఓ ద్వారా ఆటోమేటిక్ వీల్‌చైర్ అందేలా చేశారో ప్రొఫెసర్. 'దాంతో ఒక్కడినే ఎక్కడికైనా వెళ్లే స్వేచ్ఛ వచ్చింది. నా శక్తి 25శాతం పెరిగినట్లయింది' అని చెబుతాడు సూరజ్. ఆపైన లైబ్రరీ విభాగం ల్యాప్‌టాప్‌ను అందించింది. శిక్షణకు డబ్బు లేకపోవడంతో పుస్తకాలు చదువుతూ, యూట్యూబ్‌లో వీడియో పాఠాలు వింటూ నోట్స్ రాసుకునేవాడు. కొత్తగా ఎడమచేత్తో రాయడాన్ని అలవాటు చేసుకున్నాడు. ఎక్కువసేపు రాయడానికి కష్టమయ్యేది. అందుకే విషయాన్ని లోతుగా ఆకళింపు చేసుకుని బుల్లెట్ పాయింట్స్ రాసుకునేవాడు. పరీక్ష రాయడానికి స్క్రైబ్ (సహాయకుడు)ని ఇస్తారు కనుక అతడికి చెప్పే విధంగా సిద్ధమయ్యేవాడు. 2021లో మొదటి ప్రయత్నంలో ప్రిలిమ్స్ దాటకపోయినా నిరుత్సాహపడలేదు. మాస్టర్స్ చేస్తూనే రెండోసారి ఇంకాస్త ఎక్కువ శ్రమించాడు. మధ్యాహ్నం రెండింటికి లైబ్రరీలో అడుగుపెడితే రాత్రి రెండు తర్వాత బయటకు వచ్చేవాడు. ఈసారి క్లిష్టమైన ప్రిలిమ్స్ గట్టెక్కేశాడు. రాత్రీపగలూ కష్టపడి మెయిన్స్ రాశాడు. ఆ తర్వాత పిహెచ్‌డీకి అవసరమయ్యే జేఆర్ఎఫ్ సాధించాడు. ఈలోపు మెయిన్స్ ఫలితాలు వచ్చాయి. ఇంటర్వ్యూకి ఎంపికయ్యాడు. 'నువ్వు స్పెషల్ కేటగిరీకి చెందుతావు కదా. వాళ్లకోసం ఏం చేస్తావ్' అని అడిగారట ఇంటర్వ్యూ బోర్డులోని ఒక సభ్యుడు. 'నేను స్పెషల్ కేటగిరీ కాదు. నేనూ మీలాంటివాణ్ణే. నా ఆలోచనలు ఎప్పుడూ దేశప్రజలూ, విశ్వమానవుల గురించి ఉంటాయి' అని బదులివ్వగానే బోర్డు సభ్యులంతా మెచ్చుకున్నారు. మే 23న రిజల్ట్స్ వచ్చాయి. ఫ్రెండ్ చూసి 917వ ర్యాంకు అన్నాడు. నమ్మలేకపోయాడు సూరజ్. తన నంబరూ, పేరూ మార్చిమార్చి చూశాడు. తనదే పక్కా అప్పుడు తల్లిదండ్రులకు ఫోన్ చేశాడు. 29ఏళ్ల సూరజ్‌ది దివ్యాంగుల కేటగిరీలో రెండు ర్యాంకు. యువతకు ఇతను స్ఫూర్తిగా నిలిచాడు. ❑





కథ

# కళ్లు తెరుచుకున్నాయి

దుర్గమ్ బైతి

**సాయంత్రం ఆరు గంటల సమయం..**

**రమేష్ సోఫాలో కూర్చొని సెల్ చూస్తున్నాడు.**

**ఇంతలో బయట నుండి భార్గవి కూరగాయలు తీసుకొని వచ్చింది.**

**"ఆఫీసు నుండి రాగానే సెల్ పట్టుకుని కూర్చున్నారా?" రావడంతోనే అంది భార్గవి.**

**"వాట్సాప్‌లో ఒక ముఖ్యమైన ఫైల్ చూస్తున్నాను, మా బాస్ పంపించాడు" తల ఎత్తకుండానే బదులిచ్చాడు రమేష్.**

స్కూల్ నుండి సోని, రజినిలు స్కూల్ టిఫిన్ బ్యాగ్‌లతో ఇంట్లోకి వచ్చారు.

రజిని బ్యాగ్ తెరిచి ప్రోగ్రెస్ రిపోర్ట్ తీసి రమేష్ దగ్గరికి సంతోషంగా వచ్చి "డాడీ, నా ప్రోగ్రెస్ చూడండి" అంది.

రమేష్ చూడకుండానే "అక్కడ పెట్టు" అన్నాడు.

రజిని మరింత సంతోషంతో "చూడండి డాడీ" అంది.

"చెప్పేది నీకు కాదా?"

రమేష్ కోపగించుకోగానే రజిని మొహంలో అప్పటివరకున్న ఆనందం ఒక్కసారిగా పోయింది. మారు మాట్లాడకుండా రజిని బాధతో సోఫా ముందున్న టీపాయ్‌పై ప్రోగ్రెస్ కార్డు పెట్టి కిచెన్‌లోకి వెళ్లింది.

ఇదంతా కిచెన్‌లో నుండి గమనిస్తున్న భార్గవి రమేష్ దగ్గరకు వచ్చి "అమ్మాయి ఎంత బాధపడిందో చూసారా? ప్రోగ్రెస్ కార్డు చూడవచ్చు కదా!" అని అంది.

రమేష్ మాట్లాడలేదు. భార్గవి విసురుగా కిచెన్‌లోనికి వెళ్లింది. పెద్ద అమ్మాయి సోని రమేష్ దగ్గరకు వచ్చి పక్కన కూర్చుని డాడీ అని పిలిచింది.

"చెప్పమ్మా" అని ప్రేమగా అన్నాడు రమేష్.

"చెల్లెలంటే మీకెందుకంత కోపం? దాని ప్రోగ్రెస్ రిపోర్టు చూడొచ్చు కదా డాడీ" అంది.

రమేష్ సెల్ పక్కన పెట్టి సోని వైపు చూసి "అది కాదు బంగారం.. నీకర్థంకాదులే. సరే.. నీ ప్రోగ్రెస్ రిపోర్ట్ చూపించు".

సోని బ్యాగ్ తెరిచి రిపోర్ట్ రమేష్‌కు ఇచ్చింది. రమేష్ రిపోర్ట్ చూసి సోని భుజాన్ని తట్టి గర్వంగా చూసాడు.

"వెరీ గుడ్ మై చైల్డ్. 9.3 జీపీఏ వచ్చింది" అన్నాడు.

"థ్యాంక్స్ డాడీ" సోని నవ్వుతూ అంది.

సోని స్టడీ రూమ్‌లోకి వెళ్లింది. భార్గవి టీ తెచ్చి రమేష్‌కి ఇచ్చింది. పక్కన సోఫాలో కూర్చుని "మీ పద్ధతి ఏమీ బాగా లేదండి. మీరు రజిని విషయంలో చాలా తప్పు చేస్తున్నారు" మెల్లగా అంది.

రమేష్ అహం దెబ్బతిన్నది. ఒక్కసారిగా కోపంతో "నీకు ఏమీ తెలియదు, ఊరుకో" గట్టిగా అన్నాడు.

"అది కాదండి, ఇద్దరూ మన పిల్లలే కదా! ఒకరిని ప్రేమగా చూసి, మరొకరిని అయిష్టంగా చూస్తే ఆ పసిమనసు తట్టుకుంటుందా చెప్పండి" భార్గవి సర్దిచెబుతున్నట్లుగా మాట్లాడింది.




"సోనీ ఈ ఇంటి మహాలక్ష్మి. ఆ బంగారు తల్లి పుట్టిన తర్వాతే నాకు బాగా కలిసి వచ్చింది. ప్రమోషన్ వచ్చింది. ఈ ఇల్లు కట్టాం" టీ తాగుతూ అన్నాడు రమేష్.

"ఆపండి, రజిని చేసిన తప్పు ఏంటి?" నిలదీసింది భార్గవి.

"నీకు తెలియదా?" అన్నాడు రమేష్.

భార్గవి రమేష్ వైపు అసహ్యంగా చూసింది.

"ఇదేనా మీ పెద్దరికం. మీరు ఇంత నీచంగా ఆలోచిస్తారని అనుకోలేదు" బాధగా అంది.

"ఇక్కడి నుండి వెళ్లు" కోపంగా గద్దించాడు రమేష్.

"నేను వెళ్లను. మీ మనసు మారేదాకా వెళ్లనుగాక వెళ్లను" వాదనకు దిగింది భార్గవి.

రమేష్ లేచి నిలబడి "అయితే నేను వెళ్తాను" అంటూ బెడ్ రూమ్‌లోకి కోపంగా వెళ్లాడు.

రజిని కిచెన్ రూమ్ నుండి భార్గవి దగ్గరకు వచ్చి నిలబడింది. భార్గవి ఆగకుండా వస్తున్న కన్నీళ్లను తుడుచుకుంది.

"ఏమైందమ్మా? ఏడుస్తున్నావ్?" అడిగింది రజిని.

"ఏమీ లేదమ్మా" బాధను దిగమింగుకుని నవ్వుతూ అంది భార్గవి.

"నాకు తెలుసమ్మా, డాడీ నిన్ను తిట్టాడు.

"అది కాదు రజినీ"

రజిని సోఫాలో భార్గవి పక్కన కూర్చుని ఏడ్చింది.

"అమ్మా, డాడీకి నేనంటే ఎందుకు ఇష్టం లేదు. అక్కను మంచిగా చూస్తాడు. నన్నేమో ఎప్పుడూ ద్వేషంగానే చూస్తాడు. నేను ఏమి తప్పు చేసానమ్మా?" ఏడుస్తూనే ఉంది రజిని.

"నువ్వు పుట్టడమే తప్పమ్మా" అని మనసులో అనుకుని, భార్గవి రజినిని దగ్గరకు తీసుకుంది.

భార్గవి మౌనాన్ని రజిని మళ్లీ ప్రశ్నించింది. ఏమి సమాధానం చెప్పాలో అర్థం కాక భార్గవి కొద్దిసేపు మాట్లాడలేదు. ఆలోచనలో పడింది.

"మాట్లాడవమ్మా!"

భార్గవి రజిని గదవ పట్టుకుని బుజ్జగిస్తూ మొదలెట్టింది.




"బంగారుతల్లీ, పెద్ద పెద్ద మాటలు ఎందుకమ్మా, డాడీకి మీ ఇద్దరూ ఇష్టమే. అక్కను చదివించినట్లుగానే నిన్ను చదివిస్తున్నాడు. అక్కకు ఏమి కొనిస్తున్నాడో నీకు అలాగే కొనిస్తున్నాడు కదా! ఆయనకు నీపై చాలా ప్రేమ ఉంది. పైకి కనిపించదు... అంతే!"

"అబద్ధం చెబుతున్నావు. అక్కతో ఎంతో ప్రేమగా మాట్లాడుతాడు. నేను ఎన్నిసార్లు పిలిచినా మాట్లాడడు" చిన్నబుచ్చుకుంది రజిని.

ఎలా సముదాయించాలో భార్గవికి తోచలేదు. రజినిని ఎలా ఓదార్చాలో తెలియడం లేదు.

సోని స్టడీ రూమ్ నుండి హాలులోకి రాగానే భార్గవి టాపిక్ మార్చింది.

"రామ్మా సోనీ, ఇలా కూర్చో" అంది.

సోని సోఫాలో భార్గవి పక్కన కూర్చుంది.

"ఈరోజు స్కూల్‌లో ఏమి జరిగిందో చెప్పమ్మా!" అడిగింది.

"అమ్మా, ఈరోజు స్కూల్లో పెద్ద మీటింగ్ జరిగింది"

"భార్గవీ.. ఇలా రా" లోపలి నుండి రమేష్ పిలిచాడు.

"డాడీ పిలుస్తున్నారు.. మళ్లీ వస్తాను. వచ్చాక చెబుదువుగానీ" అనుకుంటూ భార్గవి లోపలికి వెళ్లింది.

రమేష్ వైట్ షర్ట్ కనిపించడం లేదంటే భార్గవి డ్రెస్సింగ్ రూమ్‌లో వెతికి ఇచ్చింది.

"రజినీ! ఎందుకు ఏడుస్తున్నావు?" చెల్లెలి కన్నీళ్లను చూసి అడిగింది సోని.

"నేనా! ఎందుకేడుస్తాను? ఏడవడం లేదు.."

"సరేలే, నేను రాగానే అమ్మ టాపిక్ మార్చింది. మీరు ఏమి మాట్లాడు కున్నారు?" మళ్లీ అడిగింది సోని.

రజిని ఏడ్చింది.

"అక్కా, డాడీకి నేను ఎందుకు నచ్చడం లేదు. నేనేమి తప్పు చేసానో అర్థం కావడం లేదు" అడిగింది రజిని.

"నాకు తెలిసింది చెబుతాను. అయితే నీవు ఎవరికీ చెప్పవద్దు" మెల్లగా అంది సోని.

"భార్గవీ.. ఇలా రా" లోపలి నుండి రమేష్ పిలుపు విని "డాడీ పిలుస్తున్నారు.. మళ్లీ వస్తాను. వచ్చాక చెబుదువుగానీ" అనుకుంటూ భార్గవి లోపలికి వెళ్లింది. రమేష్ వైట్ షర్ట్ కనిపించడం లేదంటే భార్గవి డ్రెస్సింగ్ రూమ్‌లో వెతికి ఇచ్చింది.

"రజినీ! ఎందుకు ఏడుస్తున్నావు?" చెల్లెలి కన్నీళ్లను చూసి అడిగింది సోని.

"ఎవరికీ చెప్పనులే!" ఏడుపు ఆపి అంది రజిని.

"ఒట్టు" చేయి చాపింది సోని.

రజిని సోని చేతిలో చేయి వేసింది.

"డాడికి నువ్వు కొడుకుగా పుడతావని కలలు కన్నాడట. నేను పుట్టగానే మహాలక్ష్మి పుట్టిందని సంతోషించాడట. రెండోసారి కొడుకు పుట్టాలని ఎందరో దేవుళ్లకి మొక్కుకున్నాడట. నువ్వు పుట్టేసరికి ఆయన ఆశలు ఆవిరై నీ మీద ద్వేషం పెంచుకున్నాడట. ఒకసారి మమ్మీ డాడీతో ఈ విషయమై గొడవ జరిగింది. అప్పుడు నాకు తెలిసింది" భయపడుతూనే అటు ఇటు చూస్తూ చెప్పింది సోనీ.

"ఇందులో నా తప్పు ఏముందక్కా?" అమాయకంగా అడిగింది రజిని.

"బాధపడకు చెల్లీ, ఏదో ఒకరోజు డాడీ నీ విలువ తెలుసుకుంటాడులే" ఓదార్చింది సోని.

"ఆరోజు వస్తుందా అక్కా?" ఆశగా అంది రజిని.

కాలింగ్ బెల్ శబ్దం వినిపించింది.

"ఎవరొచ్చారో చూడండి" కిచెన్ నుండే చెప్పింది భార్గవి.

సోని వెళ్లి తలుపు తెరిచింది. ఎదురుగా స్కూల్ హెడ్ మాస్టర్ కృష్ణమూర్తి.

"గుడ్ ఈవినింగ్ సర్" రెండు చేతులు జోడించి అంది.

కృష్ణమూర్తి ఇంట్లోకి వచ్చాడు.

రజిని నిలబడి నమస్కారం చేసింది.



"కూర్చోండి సర్" కుర్చీ చూపించింది రజిని.

"థాంక్యూ" అంటూ కృష్ణమూర్తి కూర్చున్నాడు.

లోపలి నుండి రమేష్ వచ్చి నమస్కారం చేసి, సోఫాలో కూర్చున్నాడు.

భార్గవి నీళ్లగ్లాస్ తెచ్చి ఇచ్చింది.

"కంగ్రాచ్యులేషన్స్ రమేష్‌గారు" ఆనందంగా చెప్పాడు కృష్ణమూర్తి.

"దేనికి సర్..?" ఆశ్చర్యంగా అడిగాడు రమేష్.

"ఏమ్మా, మీరు చెప్పలేదా?" కృష్ణమూర్తి పిల్లల వైపు చూస్తూ అన్నాడు.

"ఏమి జరిగింది సర్" భార్గవి అడిగింది.

"ఇంత పెద్ద విషయం ఇలా సింపుల్‌గా చెబుతున్నానని ఏమీ అనుకోవద్దండి" అన్నాడు కృష్ణమూర్తి.

రమేష్ భార్గవి వైపు చూసాడు.

భార్గవి అంతే ఆశ్చర్యంగా చూసింది. ఎవరికీ ఏమీ అర్థం కావడం లేదు.

"మీ అమ్మాయి మా స్కూల్‌లో చదవడం మాకు గర్వంగా ఉంది సర్. మీరు ఎంతటి అదృష్టవంతులండి. అసలు విషయానికి వస్తాను.

మా స్కూల్‌లో చదివి అమెరికాలో స్థిరపడిన ఒక ఎన్నారై 'బెస్ట్ స్టూడెంట్ అవార్డు' ఏర్పాటు చేసి, స్కూల్‌లో ఒకరిని ఎంపిక చేయమని మాకు చెప్పారు.

మేం ఒక కమిటీని నియమించాం. విద్యా సంబంధిత, మిగతా అన్ని అంశాల్లో ప్రతిభా సామర్థ్యాలు పరిగణనలోకి తీసుకున్న కమిటి- చదువులో, ఆటల్లో, సాంస్కృతిక రంగాల్లో విశేష ప్రతిభ గల ఎనిమిదో తరగతి చదువుతున్న మీ అమ్మాయి రజినిని ఎంపిక చేసాం.."

హెడ్‌మాస్టర్ మాటలు పూర్తి కాకముందే- "నిజమా సర్?" ఆతృతంగా అడిగాడు రమేష్.

"అవును డాడీ, ఈరోజు మీటింగులో చెల్లిని అందరు మెచ్చుకున్నారు" అంది సోని.

రమేష్, భార్గవి హెడ్ మాస్టర్ వైపు తదేకంగా చూస్తున్నారు.

"అవార్డు కింద లక్ష రూపాయల నగదు, పదవ తరగతి వరకు ఉచిత విద్య, పుస్తకాలు, ఫీజులు ఇస్తారు. ఇంకా గొప్ప విషయం ఏమిటంటే వారం రోజుల పాటు మీ కుటుంబ సభ్యులందరు దేశంలో మీకు నచ్చిన యాత్రా స్థలానికి వెళ్లి రావడానికి ఫ్లైట్ చార్జీలు, హోటల్ బిల్లులు అన్నీ వారే సమకూర్చుతారు.

మరో ముఖ్యమైన విషయం ఆ ఎన్నారైగారు వచ్చే వారం ఇక్కడకు వస్తున్నారు. మీ దంపతులిద్దరికీ మా స్కూల్‌లో సత్కారం ఉంటుంది. మిమ్మల్ని స్వయంగా ఆహ్వానించడానికి వచ్చాను".

"చాలా సంతోషంగా ఉంది సర్" రమేష్ ఉబ్బితబ్బిబ్బయ్యాడు.

భార్గవి కిచెన్‌లోకి వెళ్లి టీ తెచ్చి హెడ్‌మాస్టర్‌కు, రమేష్‌కు ఇచ్చింది.

"మీ శ్రమ వృథా కాలేదమ్మా, రజినిని చాలా సార్లు అడిగాను "నీ ప్రతిభా పాటవాలకు కారకులు ఎవరని?" హెడ్ మాస్టర్ కృష్ణమూర్తి టీ తాగుతూ అన్నాడు.

"ఎవరని చెప్పింది సార్?" రమేష్ అనుమానంగా అడిగాడు.

"మీరేనని చెప్పింది" హెడ్‌మాస్టర్ చెప్పగానే రమేష్ సిగ్గుతో తల దించుకున్నాడు.

"అవును సర్, మీ అమ్మాయి మీరు తల ఎత్తుకునే విజయాన్ని సాధించింది. మీరు గర్వంగా తల ఎత్తుకోండి సర్".

రమేష్ మాట్లాడలేదు.

హెడ్ మాస్టర్ భార్గవి వైపు చూస్తూ "ప్రతి ఇంటికి నీ లాంటి తల్లి చాలా అవసరం. పిల్లలు ఆత్మవిశ్వాసం కోల్పోయిన ప్రతిసారీ తల్లులు ధైర్యాన్నిచ్చి వారిని అత్యంత శక్తివంతులుగా మారుస్తారు" అంటూ హెడ్‌మాస్టర్ కృష్ణమూర్తి లేచాడు.

భార్గవి హెడ్ మాస్టర్‌కు చేతులు జోడించి నమస్కారం చేసింది.

హెడ్‌మాస్టర్ సంతోషంగా వెళ్లాడు.

భార్గవి రమేష్ దగ్గరకు వచ్చి "ఇప్పటికైనా చూసారా?" అంది.

రమేష్ భార్గవి నోరు మూసి "చచ్చిన పాముని ఇంకా చంపకు. నేనెంత తప్పు చేసానో నాకిప్పుడు అర్థమయింది. జీవితంలో సరిదిద్దుకోలేని తప్పు చేసాను. చిట్టితల్లి మనసును గాయపరిచాను" అన్నాడు.

రమేష్ రజినిని దగ్గరకు తీసుకొని "ఈ డాడీని క్షమిస్తావా?" పశ్చాత్తాపపడుతూ అడిగాడు.

"ఐ లవ్ యు డాడీ" అంది రజిని.

"ఇక మనింట్లో ఎటువంటి బాధలుండవు. డాడీ మారిపోయారు మమ్మీ" అంది సోని.

రమేష్ టీపాయ్ మీదున్న రజిని ప్రోగ్రెస్ రిపోర్ట్ తీసుకుని చూసాడు.

"ఈరోజు నాకు చాలా సంతోషంగా ఉందండీ. అవార్డు వచ్చినందుకు కాదండీ. మీకు రజిని నచ్చినందుకండి. ఈరోజు కోసం ఎంతో ఎదురు చూసానండి" భార్గవి కళ్ల నుండి నీరు ఆగడం లేదు.

"అవును డాడీ, మీ ప్రేమ పొందడమే నాకు పెద్ద అవార్డు" ఆనందంగా అంది రజిని.

"అవునమ్మా, పిచ్చి నమ్మకాల భ్రమలో మునిగి ఇంత కాలం అవివేకుడిలా ప్రవర్తించాను. మీ అమ్మ ఈ విషయమై నాతో చాలాసార్లు గొడవపడింది. ఎప్పుడూ నీకు నాపై ద్వేషం కలగకుండా ప్రయత్నించింది. భార్గవి నాకు భార్యగా లభించడమే గొప్ప అవార్డు" చిన్న పిల్లాడిలా రోదిస్తున్నాడు రమేష్.

నువ్వన్న మాటలు నిజమయ్యాయనే భావనతో అక్క వైపు కృతజ్ఞతగా చూసింది రజిని. రమేష్ కన్నీళ్లలో బూజు పట్టిన మూఢ నమ్మకాలు కరిగిపోయాయి.

భార్గవి ఆనంద భాష్పాలలో ఆ ఇంటి కంటి పాపల ఆనందం ప్రస్ఫుటంగా కనిపించింది.



# అయోమయంలో లేనిదెవరు?

**"ఉన్న గందరగోళ పరిస్థితిలో నాకు పిచ్చి ఎక్కేట్టుందిరా?" అన్నాడు ఓ మిత్రుడు నాతో.**

**ఏదో ఇప్పటివరకు అతనికి పిచ్చి పట్టనట్టు.**

**మనసులో గందరగోళం లేని మనిషి ఎవరు చెప్పండి.**

నా మనసులో ఎలాంటి గొడవలూ లేవు. అసలు గందరగోళానికి చోటే లేదురా. నేను స్పష్టంగా ఉన్నాను అని ఎవరైనా ఒకడు అన్నాడంటే అతనికి అతని గురించి తెలియకుండా చెప్తున్న మాట అవుతుందది.

"ఇప్పుడు మీ మనసులో గందరగోళం ఉందా? లేదా? అని తెలుసుకోవడానికి ఓ దారి ఉంది" అన్నారొకరు. ఆయన ఇంకెవరో కాదు, భగవాన్ రజనీష్. అదేనండి ఓషోగా అందరికీ పరిచయమైన ఆ పెద్దాయన.

అదేమిటో తెలుసా..

ఎవరూ లేని ఓ గదిలోకి వెళ్లి తలుపులు వేసుకోవాలి. ఓ టేప్ రికార్డరు ఆన్ చేయండి.

మీ మనసులో వచ్చే మాటలన్నింటినీ పైకి చెప్పండి. ఏదనుకుంటే అదే. అలాగే చెప్పండి.

చెప్తున్న వాటిలో అర్థాలు ఉన్నాయో లేవో అనవసరం. ఏదనుకున్నారో అది చెప్పెయ్యాలి.

ఓ పావుగంట తర్వాత రికార్డయిన మాటల్ని వినండి. ఎవరో మాట్లాడుతున్నారనుకుని వినండి.

అప్పుడు తెలుస్తుంది మీలో ఎంత గందరగోళం ఉందోనని. ఎన్ని అబద్ధమైన ఆలోచనలో మనలో ఉన్నాయో తెలిసొస్తాయి. ఒకదానికొకటి సంబంధం ఉండదు. మన మనసులో ఎన్నెన్ని అర్థరహిత ఆలోచనలు ఉన్నాయో తెలుస్తాయి.

ఇది నిజం... మీరు ఇది పరీక్షించుకోవాలంటే ఇలా చేసి చూడండి అంటారు ఓషో.

దీని అర్థం ఏమిటి?


పిచ్చివాళ్ల కేంద్రంలో ఉన్నతనికి నూరు శాతం పిచ్చి పట్టింది.

మనకు ఆ మేరకు పట్టలేదంతే.. అనుకోవాలి.

అయినా మన స్థితి బయటకు కనిపించదంతే. బయట అందరికీ మనం సరైన మనిషిలాగానే కనిపిస్తాం, అనిపిస్తాం. ఇతరులకు మన మనసులో ఉన్నదేంటో తెలీదు. మనం ఇతరులతో అవీ ఇవీ చెప్తాం. కానీ నిజానికి మనం చాలా విషయాలు దాస్తాం.

ఈ క్రమంలో మనం ఎదుటి వారినే కాదు మనల్నే మనం మోసగించుకుంటున్నామని అర్థం.

మనిషికి తగ్గట్టు మనం మన ముఖాన్ని



మార్చుకుంటూ ఏవేవో మాట్లాడుతాం. అబద్ధపు ముఖంతో కనిపిస్తాం. కానీ అది ఎదుటివారికి అర్థం కాదు. అందువల్ల మనం నిజమైన వారిలా అనిపిస్తాం.

మన అబద్ధాలను మనం నమ్ముతూ ఇతరులను నమ్మిస్తాం.

సరే..! అదలా ఉండనిచ్చి విషయానికి వద్దాం.

మనసులోని గందరగోళాన్ని తొలగించుకోవడం ఎలా?

నిదానంగా ఆలోచించి స్థిమితంగా ఉండటం ఎలా? అని ప్రశ్నిస్తే దానికి జవాబు చెప్పున్నారు ఆ పెద్ద మనిషి.

ఓ పిచ్చోడు ఏమనుకుంటున్నాడు.. ఇతరులను పిచ్చివాడని అనుకుంటాడు. కాదు. తనకు పిచ్చి అని తెలుసుకోవడం మొదలుపెడితే అతను కాలక్రమంలో ఓ నిలకడైన స్థితికి రాగల అవకాశాలు ఉన్నాయి.

అందుకే మనం చెయ్యవలసినదేమిటంటే–

మనం మన నిజ స్థితిని సమీక్షించుకోవడం మంచిది.

మనకు ఎదురయ్యే వాటికి మనమే బాధ్యులమని తెలుసుకోవడం ముఖ్యం. మనలో ఓ సరైన స్థితిని ఏర్పరచుకుని అందులో మనకు మనమే యజమానిగా ఉండాలి. సరైన దిశలో మనల్ని మనమే నడిపించుకోవాలి.

నిజ ముఖంతో నిదానంగా ప్రవర్తించాలి. ఇలా ఆయన చెప్పారు. అయినా ఇదంతా మన స్థాయిలో ఏ మేరకు సాధ్యమో ఆలోచించాలి. అయినప్పటికీ ప్రయత్నమైతే జరగాలి. అది ముఖ్యం.

ఒకడడిగాడు..

"ఎందుకు సార్, ఈ లోకంలో ఒకే ముఖంలా తొమ్మిది మంది ఉన్నారంటారు. అది సాధ్యమేనా?" అని.

"సాధ్యమే.. ఎందుకు అలా అడుగుతున్నావు?" అన్నాడు ఇంకొకడు.

"ఏమీ లేదు.. గత నెలలో నీ దగ్గర తీసుకున్న వెయ్యి రూపాయలు నీ లాంటి మనిషే ఒకడు కనిపిస్తే అతనికి ఇచ్చేసాను. అందుకోసం అడుగుతున్నానని అన్నాడు.

**- యామిజాల జగదీశ్**




# తెలుగు కథా, నవలా చక్రవర్తి 'త్రిపురనేని గోపీచంద్'

తెలుగు సాహిత్యంలో ఎందుకు? అన్న ప్రశ్న వేయడాన్ని తండ్రి కవిరాజు త్రిపురనేని రామస్వామి చౌదరి వద్ద నేర్చుకొన్న గోపీచంద్ వివిధ సాహితీ ప్రక్రియలలో వైశిష్ట్యాన్ని సాధించారు.

హేతువాదిగా, నాస్తికవాదిగా సాహిత్య రంగంలోకి అడుగు పెట్టిన గోపీచంద్ తొలి రోజులలో మార్క్సిజం ప్రభావంతో 'బీదవాళ్లంతా ఒకటి', 'దేశం ఏమయ్యేట్టు', 'గోడ మీద మూడోవాడు', 'పిరికివాడు' కథలు రాసి పాఠకులను ఆకట్టుకొన్నారు. ఎం.ఎన్.రాయ్ నవ్య మానవతా వాదం చేపట్టి, రాజకీయ సిద్ధాంతాలకు అనంతరం స్వస్తి చెప్పిన గోపీచంద్, కథా నవలా చక్రవర్తిగా తన రచనలలో నిజాయితీ, నిర్భీకత, నిర్మొహమాటంతో తాను విశ్వసించిన సత్యాలను సహజ సుందరంగా తీర్చిదిద్దారు. 1943లో కరుణరస ప్రధానమైన మొదటి నవల 'పరివర్తన' 1945-46లో ఆధునిక తెలుగు నవలా సాహిత్యంలో చిరస్మరణీయంగా నిలిచిపోయిన 'అసమర్థుని జీవయాత్ర' 1947లో ఎందుకు? అన్న ప్రశ్న నేర్పిన తండ్రికి అంకితం యిచ్చారు. 'మెరుపుల మరకలు', 'పిల్లతెమ్మెర', 'గడియ పడని తలుపులు', 'పండిత పరమేశ్వర శాస్త్రి వీలునామా', 'శిథిలాలయం', 'గతించిన గతం', 'యమపాశం', 'ప్రేమోపహతులు' తెలుగునాట సంచలనం సృష్టించాయి.

భౌతిక ఆధ్యాత్మిక వాదాలను సమన్వయపరిచే 'పోస్టు చెయ్యని ఉత్తరాలు', 'భారతీయ పాశ్చాత్య తత్త్వవేత్తల తాత్వికతను విశ్లేషిస్తూ రాసిన తత్త్వవేత్తలు, 'అ్రు కడిగిన ఎద్దు' తుమ్మచెట్టు వంటి జీవాల గురించిన కరుణరసాత్మకంగా రాసిన 'మాకూ ఉన్నాయి స్వగతాలు' వంటి రచనలు తెలుగు సాహిత్యాన్ని సుసంపన్నం చేసాయి. రచయితగా, ప్రజామిత్ర వ్యాస రచయితగా అనేక వ్యాసాలు రాసిన గోపీచంద్‌ను, గూడవల్లి రామబ్రహ్మం, తొలితరం తెలుగు చలనచిత్రం 'రైతుబిడ్డ'కు సంభాషణలు రాయించారు.

1938 నుంచి దాదాపు పదిహేను సంవత్సరాలు మద్రాస్‌లో సినీ రంగంలో రచయితగా, దర్శకునిగా జయాపజయాలు ఎదుర్కొని 'గృహప్రవేశం', 'లక్ష్మమ్మ', 'పేరంటాలు', 'ప్రియురాలు', 'ధర్మదేవత' చిత్రాలు ఆటుపోట్లను ఎదుర్కొన్నా కొన్ని విజయం సాధించాయి.

తన జీవితమంతటినీ సాహిత్య సృజనకీ, సత్యాన్వేషణల తాత్త్విక చింతనకు అంకితం చేసిన మహోన్నత రచయితగా గోపీచంద్, చలనచిత్ర రంగం నుంచి సమాచార శాఖ, ఆకాశవాణిలలో బహుముఖ ప్రతిభావంతునిగా సేవలందించారు. 'మాలపల్లి' నవలను రేడియో నాటకంగా తీర్చిదిద్దారు. గోపీచంద్ రచనలలో జిజ్ఞాస, అన్వేషణలతో కథా కథన శిల్పం జీవంతో, భావతరంగాలతో ఉత్తేజితం చేస్తుంది. తండ్రి కవిరాజు రామస్వామి చౌదరి పండితుడు, చారిత్రకుడు, భాషా శాస్త్రవేత్త, తత్త్వవేత్త. నాటకం, కావ్యం, గేయ ప్రక్రియలలోను, విమర్శనా వచన సాహిత్యంలో తండ్రి అగ్రగణ్యులు. గోపీచంద్ సమకాలీన సమాజం వ్యక్తుల ప్రవృత్తులు, సంఘటనల నుండి కథ, నవల, నాటకం ప్రక్రియలుగా తత్త్వాన్వేషకునిగా రచనలు కొనసాగించారు.



తెలుగు సాహితీ సీమలో చలానికీ, గోపీచంద్‌కు కొంత పోలిక వుంది. ఇద్దరూ నిత్య సత్యాన్వేషకులే. ఎప్పటికప్పుడు వారి జీవితానుభవాలను, వారికి స్ఫురించిన సత్యాలను నిర్భయంగా, నిస్సంకోచంగా ప్రకటించినవారే. సమాజంలోని న్యాయాలు, నీతులు, ధర్మాలు శాశ్వతాలు కావని దేశ కాలమాన పరిస్థితులు, యితర మార్పులతో అవి మారతాయని భావించినవారే. గోపీచంద్ కూడా వ్యక్తిగా, రచయితగా అంతర్, బహిర్ యుద్ధాల నమ్మిన సత్యాలకి, సంభవిస్తున్న పరిణామాలకి సంబంధిత అద్భుత సాహిత్యాన్ని సృష్టించారు.

ఆధునిక తెలుగు సాహిత్యంలో త్రిపురనేని గోపీచంద్ సాహిత్యానికి స్పష్టమైన నిబద్ధత వుంది. సామాజిక పరిస్థితుల ప్రభావం వలన తల ఎత్తే పరిణామాలను నిశితంగా పరిశీలించి స్థితిగతులను తాత్వికంగా విశ్లేషించుకొని సూటిగా సరళంగా అక్షర రూపం యివ్వగలగడంతో గోపీచంద్ రచనలు యదార్థ జీవన వ్యథార్థ కథనలుగా గుర్తింపు పొందాయి. తరాలు మారినా, గ్రామీణ జీవన విషాదం అలా గూడు కట్టుకొని వుందనే వాస్తవ చిత్రణను 1941 నాటి 'పోస్ట్ చేయని ఉత్తరాలు' స్పష్టం చేస్తాయి.

తెలుగునాట పల్లెల స్థితిగతులు, గ్రామీణ జీవన ఎలా కుంగి కృషిస్తోందో ఆర్థిక విధానాలు, మానవ సంబంధాలలో వస్తున్న మార్పులు తెలుగు సాహిత్యంలో ఆలోచనా ప్రేరకంగా చిత్రీకరించిన మేధావి గోపీచంద్. ఆయన కథలు, నవలలు, ఉత్తరాలు, సినీ సాహిత్యం చదివిన తర్వాత పఠితల మేధలో ఆలోచనలు సుడి తిరుగుతాయి. 1910 సెప్టెంబరు 8న కృష్ణా జిల్లా అంగలూరులో జన్మించిన గోపీచంద్ 1962 నవంబరు 2న స్వర్గస్థులయ్యారు. సుమారు మూడు దశాబ్దాల కాలంలో మూడు వందల కథలు, నవలలు, నాటకాలు, వ్యాసాలు.. ఇలా ఏం రాసినా జీవితమంతా సాహిత్య సృజనకీ, సత్యాన్వేషణకు అంకితం చేసారు. తెలుగు సాహిత్యంలో గోపీచంద్ స్థిర యశస్వి. సాహితీవేత్తగా చిరంజీవి.

**- జయసూర్య**

# బంధాలు-అనుబంధాలు

**పెళ్లిచూపులు జరుగుతున్నాయి. పెద్ద మనుషులు చాలా మంది ఉన్నారు. పెండ్లికొడుకు తరపున ఒక వేద పండితుడు కూడా ఉన్నాడు. ఇరు పక్షాలూ "ఆహా! ఎంత లక్షణమైన సంబంధం?" అని అబ్బురపడుతున్నారు. కాకపోతే అమ్మాయి, అబ్బాయి వీడియో ద్వారా చాలా రోజులు మాట్లాడుకున్నారు. పెద్దల సమక్షంలో ఎంచక్కా చూపులు నిర్వహించాలి అంటే "అలాగే" అని కూడా ఒప్పుకున్నారు.**

ఈ కాలంలో కూడా ఇంత బుద్ధిమంతులున్నారా? అనే ఆలోచన ఇద్దరి వైపూ వచ్చింది. తెగ మురిసిపోతున్నారు, ముసి ముసి నవ్వులు నవ్వుకుంటున్నారు. ఫలహారాలు ఆరగిస్తున్నారు. పాత కాలం పద్ధతిలో ఒకరినొకరు పరిచయం చేసుకుంటూ చుట్టరికాలు కలిపేసుకుంటున్నారు. చాలా సందడిగా ఉంది. ఇంత హాయిగా ఒకరినొకరితో మాట్లాడుకుని ఎంత కాలం అయిందని.. అనుకుని సంతోషపడ్డారు. మహిళలు పట్టుచీరెలు ధగ ధగ మెరిపించేసారు. పురుషపుంగవులు వారి ప్రతిభా పాటవాలను ప్రదర్శిస్తు న్నారు. ఇరుగు-పొరుగువారు కూడా ఒక చెవి ఇటు వైపు విసిరేసి కాలక్షేపం చేస్తున్నారు. కుర్రాడు కళ్లజోడు ఒకటికి రెండు సార్లు తుడిచి ముక్కు మీదకి సున్నితంగా ఆన్చి తల గుండ్రంగా తిప్పి అందరినీ పరికించి చూస్తున్నాడు. ఇద్దరు చిన్న పిల్లలు అందరి మధ్యలోకి వచ్చి పెండ్లికొడుకుని వింతగా చూసి బిగ్గరగా నవ్వి తెగ సందడి చేస్తున్నారు.

అమ్మాయి వచ్చింది ఇంతలోనే. గంధం రంగు చీరెకుచ్చిళ్లను జాగ్రత్తగా చేతులతో అదుముకుంటున్నప్పుడు బంగారు గాజుల మెరుపు ఆ చీరె అందానికి మరింత అందం కలిపింది.

"గంధం రంగు చీరె మా అందరికీ ఎంతో కలిసొచ్చిందండీ. మా సంప్రదాయం!" నిజం చెప్పేసింది అమ్మాయి తల్లి "..... జాగ్రత్తగా కూర్చోమ్మా".

నిజమే! మరి చీరె కలిసొచ్చింది కదా! జాగ్రత్తగా కూర్చోవాలి.

అందరినీ చూస్తున్నట్లుగా తల పెడెస్టల్ ఫ్యాన్ తిరిగినట్లు తిప్పి పెండ్లికొడుకుని కూడా ఓ ఓరచూపులోంచి కొద్దిగా ఓరగా చూసేసి స్టైల్‌గా తల వంచుకుంది అమ్మాయి.

"మా అమ్మాయి వీణ నేర్చుకుంది" అమ్మాయి తండ్రి గర్వంగా చెప్పాడు.

"అలా అని సామజవరగమన పాడమని మేం అడగం" పెద్ద జోకు వేసినట్లు దాదాపు అరిచాడు ఇటువైపు నుండి ఓ ప్రతిభామూర్తి.



తప్పదు కాబట్టి అందరూ నవ్వారు. అబ్బాయి తండ్రి దగ్గాడు.

"అబ్బాయి.." అన్నాడు. ఇద్దరూ అన్ని విషయాలూ చర్చించుకున్నవే. కాస్త పక్కకి వెళ్లి మాట్లాడుకోండి. ఆ తతిమ్మా పనులన్నీ మేం చూసుకుంటాం".

ఇద్దరూ లేచారు. ఈ లోపల పెద్ద మనుషులు అంతా కలసి ఎంచక్కా ఇల్లు యావత్తూ గదుల వారీగా పరికించి చూసారు. "ఇది ఇటాలియన్ మార్బుల్..' సారువారు చెపుతున్నారు, "మీరు కొలతలు చూడండి.. ఎక్కడా కట్ చేసినట్లుండదు. ఆరు నెలలు ఆర్కిటెక్ట్‌తో తగువేసుకుని మరీ చేయించాను".

"ఈ మొక్కలు మొదటిసారి చూస్తున్నాం"

"అందరూ అదే మాట చెబుతారు. ఎందుకో చెప్పమంటారా?"

"చెప్పకపోతే మా ఆవిడ నన్ను వదలదు. కనుక్కొని అవే తెమ్మంటుంది మరి".

"అలా చెప్పండి. అయితే తప్పకుండా చెప్పాలి. కడియం వెళ్లి అన్ని హాచరీలూ తిరిగేసాను. రాజనగరంలో మాకు ఓ మిత్రుడున్నాడు. అతను బాగా లోపలికి ఎక్కడికో తీసికెళ్లి ఇవి చూపించాడు. జాగ్రత్తగా చూడండి. అసలు తొలుత నేనూ నమ్మలేదు".

"ఏంటండీ?"

"ఇది శివునికి ఇష్టమైన ఆకండీ. జాగ్రత్తగా చూడండి.. దీని మీద అర్ధ చంద్రాకారంలో ఒక గీత ఉంటుంది".

అందరూ ఆ గార్డెన్‌లోకి వచ్చేసి ఏదో గని దొరికినట్లు వింతగా చూసారు.

చుట్టూ ఉన్నవారు బాల్కనీల లోంచి చూస్తున్నారు. ఇంకా నిశ్చితార్థం కూడా కాలేదు, ఎంత చక్కగా కలసిపోయారో చూసారా? మనమూ ఉన్నాం. పెళ్లయిన ఏడేండ్లకు కూడా ఒక్కసారి ఆ మహాతల్లి ఇంటికి రాలేదు... ఇలా రకరకాల గుసగుసలు.

"ఈ కారు.."

"ఆగండి.. తొందర పడకండి. ఇది నాకు సెంటిమెంటల్ కారు. ప్రేమిలోమ్ పద్మిని. మా ఆవిడ పేరు పద్మిని. నేను ప్రేమిలోమ్ అని పిలిచేవాడిని.

ఆవిడ పైట సర్దుకుని సిగ్గు చూపించింది.

"మరి ఈ మధ్య కారు కొనలేదా?"

"మూడు ఏకంగా. అదుగోండి ఆ ఎదురుగా రోడ్డు అవతలున్న ప్లాటు కూడా మాదే. అక్కడున్నాయి చూడండి... మొదటిది 'కియా' కారు. అది మా వాడు అమెరికా నుండి వచ్చినప్పుడు వాడతాడు. ఆ పక్కనున్నది బి.ఎమ్.డబ్ల్యు. మరీ పెద్దది. మేమందరం ఫార్మ్ హౌస్‌కి వెళ్లేటప్పుడు వాడుకుంటాం. దాని పక్కన ఓ మాదిరిది బైజా. అది మా చిన్నవాడు స్నేహితులతో తిరగటానికి వాడుకుంటాడు.

(మిగతా 27వ పేజీలో..)

# యుగపురుషుడు 'శ్రీ నారాయణగురు'

**కేరళ రాష్ట్రంతో మన తెలుగు రాష్ట్రాల వారికి ఆధ్యాత్మికంగా ఎంతో అవినాభావ సంబంధం ఉంది. ఆ విధంగా మనలో చాలా మంది కేరళ సందర్శిస్తుంటాం. అద్వైత మత స్థాపకుడు శ్రీ ఆదిశంకరాచార్యులవారు జన్మించినది కేరళలోని కాలడి అనే గ్రామంలో.**

కాలక్రమంలో ఎన్నో మూఢ నమ్మకాలు, ఆచారాలు ఏర్పడ్డాయి. పైగా అగ్రవర్ణాల వేధింపులు, దళితులపై ఎంతో వివక్ష కనపరచడం ఎక్కువ ఉండేవి.


స్వామి వివేకానందులవారు భారత పర్యటన సందర్భంలో కేరళ సందర్శించినప్పుడు ఇక్కడి పాట్లు గమనించి కేరళ ఒక భ్రాంతితో నెలకొన్న ఆలయం అన్నారు. ఈ ఒక్క విశ్లేషణ చాలు.. అప్పటి కేరళ దురవస్థ తెలుసుకోవడానికి. లేని ఆర్భాటాలకు పోయి చితికిపోయినవాళ్లు ఎంతో మంది ఉన్నారు. దళితులు, కార్మికులు, పేదవాళ్లు కేరళలో బాగా అణగదొక్కబడ్డారు.

ఇటువంటి సమయంలో శ్రీ నారాయణగురు అని పిలువబడే మహామనిషి గురించి చెప్పాలి. కేరళలో వీరిని యుగపురుషన్, గురుదేవన్ అని ఎంతో ఆదరంగా సంబోధిస్తారు. శ్రీ నారాయణగురు కేరళలో జ్ఞానదీపికను వెలిగించారు అని చెప్పడంలో సందేహం లేదు.

బుద్ధుడు, క్రీస్తు, మొహమ్మద్ నబి వంటివారు చూపిన మార్గాలు ప్రజలకి ముఖ్యంగా పీడితులకు సాంత్వన చేకూర్చింది, సమాజంలో గుర్తింపు కలగించింది. మార్పు చూపించిన మార్గదర్శకులు నిస్వార్థ యోగులు. బుద్ధుడు అహింస, క్రీస్తు స్నేహాన్ని, మొహమ్మద్ నబి సహోదర భావాన్ని మనకి చూపారు. అలాగే శ్రీ నారాయణగురు సమభావం, సమానత్వం చూపారు. మానవులలో ఎటువంటి భేదాలు లేవనీ, అందరు సమానులే అని చెప్పేవారు. అందరు ఒక్కటే, కలసి జీవించాలనేవారు. తన కొత్త సిద్ధాంతంతో ప్రజలందరినీ సమ దృష్టితో చూడాలని చెప్పేవారు. అందుకే కేరళవాసులు ఆయనని యుగపురుషన్ అని భక్తితో పిలుస్తారు.

రవీంద్రనాథ్ ఠాగూరు, మహాత్మా గాంధీ ఈయనని గురుతుల్యునిగా భావించేవారు. కేరళలో గురుదేవన్ సంబోధించేవారు.

కేరళ ప్రజానీకంలో శ్రీ నారాయణ గురు రగిలించిన చైతన్యం మరెవరూ చేయలేకపోయారు. సంఘసంస్కర్తగా వీరి ప్రభావం ఇప్పటికీ చెక్కుచెదరలేదు. తన జీవన రీతి ద్వారా గురువుగా, భక్తులకి దేవునిగా ఎంతో ఆదరణీయులు అయ్యారు శ్రీ నారాయణ గురుదేవులు.



శ్రీ నారాయణగురు 20 ఆగస్టు, 1856 తిరువంతపురం జిల్లా చెంబజ్ఞంతిలో మాడన్, కుట్టియమ్మ దంపతులకి జన్మించారు. నారాయణన్ అన్నది అసలు పేరు కానీ ముద్దుగా నాను అని పిలిచేవారు. ఇతని బాల్యంలోనే ఆధ్యాత్మిక భావాలతో మాట్లాడేవాడు. కొండలు, గుట్టలలో ఒంటరిగా తిరిగేవాడు. పూజ కోసం పెట్టిన పండ్లు ముందు తినేసేవాడు.

కోప్పడితే "నేను తింటే దేవుడు తిన్నట్టే" అని నవ్వుతూ అనేవాడు. మడితో ఉండేవారిని కావాలని అల్లరి చేసేవాడు. అలాగే తక్కువ కులంవాళ్లతో కలిసి తిరిగేవాడు.

నారాయణన్‌కి విజయదశమినాడు విద్వాన్ ముథుపిళ్ల అక్షరాభ్యాసం చేశారు. వీరి నుండి అమరకోశం, సిద్ధరూపం నేర్చుకున్నారు. ఆ తరువాత మేనమామ కృష్ణన్ వైద్యర్ దగ్గర కావ్యాలు చదివారు. తరువాత రామన్‌పిళ్ల వద్ద పఠనం గావించి తన గ్రామంలో పాఠశాల ప్రారంభించి 'నాను ఆసాన్' అని పేరు తెచ్చుకున్నారు. యుక్తవయసులోనే విష్ణు స్తోత్రాలను రచన చేసి తనలోని భక్తిని చాటుకున్నారు. భక్తి, శాంత స్వభావం గ్రామస్థుల మధ్య ఆదరణీయుడయ్యాడు.

తల్లిదండ్రుల బలవంతం మీద వివాహం చేసుకున్నారు. కానీ సంసార బంధంలో చిక్కుకోడానికి ఇష్టపడేవాడు కాదు. ఎప్పుడూ గుట్టల మీద ధ్యానం చేసుకునేవాడు. తల్లిదండ్రుల మరణం తరువాత పూర్తి సన్యాస మార్గం తీసుకున్నారు. అప్పుడు చట్టంబి స్వామిగల్, తైకాడ్ అయ్యావుతో పరిచయంమైంది. యోగ విద్యలో అనుభవం కలిగింది. సుబ్రహ్మణ్య స్వామి భక్తునిగా మారి మలయాళం, సంస్కృతంలో షణ్ముఖ స్తోత్రాలను రచించాడు. అందరు స్వామి అని పిలువసాగారు.

కఠినమైన బ్రహ్మచర్యం, యోగా, తపస్సు, భక్తి కలసి నారాయణన్‌లో దివ్యతేజస్సు వెలగసాగింది.

నారాయణన్ తన సిద్ధితో ఎంతో మందికి రోగశాంతి కలిగించేవారు. నెమ్మదిగా నారాయణన్ సిద్ధి మీద ప్రజలకి నమ్మకం ఏర్పడింది. ఎప్పుడు చూసినా తపస్సు చేసుకునే నారాయణన్‌ను చూడడానికి ఎంతో మంది వచ్చేవారు.

ఆ రోజులలో దళితులకు, తక్కువ జాతివారికి ఆలయ ప్రవేశం లేదు. నారాయణన్ భక్తులు తమకి దేవాలయం కావాలని అడిగారు. శివరాత్రిరోజు శివలింగ ప్రతిష్ఠ జరుగుతుంది అని చెప్పారు నారాయణన్.

1888 ఫిబ్రవరి నెల శివరాత్రి రోజు నెయ్యర్ అనే నదిలో మునిగి చాలాసేపటి తరువాత ఒక శివలింగంతో వెలికివచ్చారు. ఆ నదిలో మునిగినవాళ్లు ప్రాణంతో తిరిగి రాలేదట. అందుకే నారాయణన్ శక్తి మీద ప్రజలకి నమ్మకం పెరిగింది. ప్రజలు పంచాక్షరీ జపం చేయగా నారాయణన్ మూడు గంటలపాటు ధ్యానం చేసి శివలింగాన్ని ప్రతిష్ఠించారు. బ్రాహ్మణులు లేకుండా దేవాలయ ప్రతిష్ఠ ఆ సమయంలో కేరళ అంతటా పెద్ద చర్చగా మారింది. దానికి జవాబుగా "ఔను.. నేను ప్రతిష్ఠించినది దళిత శివుడిని" అని అన్నారు నారాయణన్. ఆ తరువాత కేరళ నలు దిక్కుల నుండి దేవాలయ ప్రతిష్ఠ కోసం నారాయణన్‌ని పిలవసాగారు. సుమారు యాభై దేవాలయాల ప్రతిష్ఠ గావించారు శ్రీ నారాయణగురు. మరో వంద దేవాలయాలకి సహకారాన్ని, సలహాలను అందించారు. వాటిలో శివగిరి శారద క్షేత్రం, తలస్సేరి జగన్నాథ క్షేత్రం, కర్ణాటకలోని కుద్రోలి గోకర్ణనాథ క్షేత్రం పేరు పొందాయి.

శ్రీ నారాయణ ధర్మపరిపాలన యోగం అనే సంస్థని గురుదేవుని అధ్యక్షతన ప్రారంభించారు. ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించేవారు. శ్రీ నారాయణ గురు చేస్తున్న పనులకి ఎందరో సహకారం అందించేవారు.

1903 జనవరి 7న శ్రీ నారాయణ ధర్మపరిపాలన యోగం అనే సంస్థని గురుదేవుని అధ్యక్షతన ప్రారంభించారు. ఎన్నో సామాజిక సేవా కార్యక్రమాలు నిర్వహించేవారు. శ్రీ నారాయణ గురు చేస్తున్న పనులకి ఎందరో సహకారం అందించేవారు. పాఠశాలల నిర్వహణ వంటివి చేసేవారు. జీవితకాల అధ్యక్షునిగా సుమారు పదహారు సంవత్సరాలు గురుదేవులు కార్యకలాపాలు నిర్వహించారు. అదే ఎస్.యెన్.డి.పి. అని కేరళ అంతటా తమ కార్యకలాపాలు విస్తరించింది. వివాహాలు ఎంతో సరళంగా చేయడం, పాఠశాలలు నిర్మించడం, సేవా కార్యక్రమాలు చేసేవారు. ఇంత పెద్ద సంరంభాన్ని కేవలం తన మాటలోని మౌనం, చూపులలో శాంతం ద్వారా సాధించుకోగలగడం యుగ పురుషుని గొప్ప ప్రత్యేకత.

శ్రీ నారాయణగురు తన మరణాన్ని కూడా ముందుగా తెలుసుకున్నారు. తన అనారోగ్యం గురించి ఎవరూ ఆందోళన పడవద్దన్నారు. ఆ రోజు తనను చూడడానికి వచ్చిన వారందరికీ భోజనం ఏర్పాటు చేసారు. 1928 సెప్టెంబరు 20న ఉదయం భోజన కార్యక్రమం చక్కగా అందరికీ కొనసాగింది. సమయం మూడు దాటింది. విద్యానంద స్వాములవారు యోగవాసిష్ఠం చదవడం, అది విని కూర్చోపెట్టమని అడిగారు ప్రియ శిష్యుడు అచ్యుతానంద స్వామిని. ఆ కూర్చోవడం క్రమంగా పద్మాసన రూపమై నెమ్మదిగా శ్రీ నారాయణ గురు శివైక్యం పొందడం మహా పుణ్యకార్యం.

2018 సెప్టెంబర్ 21న వర్కాల శివగిరి ఆస్థాన గురుదేవుల సమాధి ఉత్సవాలను నిర్వహించారు. గురుదేవులు మహా సమాధి పొంది తొంభై ఏళ్ల అయిన సందర్భంగా ఎన్నో కార్యక్రమాలు చేశారు. ప్రపంచం నలు మూలల నుండి వేలాది మంది వచ్చారు. మార్పు తెచ్చిన మహా యుగ పురుషునిగా శ్రీ నారాయణగురు ఎప్పటికీ గుర్తుండిపోతారు.

**- ఈ.ఎస్.మాధవన్**

---

**(25వ పేజీ తరువాయి..)**

## బంధాలు-అనుబంధాలు

"మరి మీరు?" "నేను కష్టపడి పైకొచ్చాను" "ఓ..."

ఇంతలో వాళ్ల పనివాళ్ల చిన్న పిల్లవాడు ఓ ట్రేలో జ్యూస్ గ్లాసులు పట్టుకొచ్చాడు. అందరూ వాటిని పుచ్చుకున్నారు. వేద పండితులవారు కూడా పుచ్చుకుని ఏదో మంత్రం చదువుకున్నట్లు నోట్లో నీళ్ల ముందరగా నమిలి పైనుంచి ఎత్తిపట్టుకుని గొంతులోకి పోసుకున్నాడు.



"అంటే మీరు కారు నడపరా? ఈ ఫియట్ కూడా?" ఆవిడ ముందరకి వచ్చింది.

"కాదండీ.. ఈ మధ్య బి.పి. ఎక్కువైంది. డ్రైవర్‌ని పెట్టుకున్నారు"

"అదీ నిజమే. అవస్థ పడటం, అందులో హైదరాబాదులో అంత మంచిది కాదు".

"పైగా మా వాళ్లు ఒప్పుకోరు. రోజూ అమెరికా నుంచి ఫోను మీద ఫోను. అదీ సంగతి". ఇంతలో అందరూ ఇంటి వైపు తిరిగారు. అమ్మాయి, అబ్బాయి వరండాలో కనిపించారు. అబ్బాయి గబగబా మెట్లు దిగాడు.

"నాన్నా, వెళదాం పద. నమస్కారమండీ" అందరికీ నమస్కారం పెట్టాడు. గబగబా బైటకెళ్లి కారెక్కేసాడు. అమ్మాయి లోపలికెళ్లిపోయింది.

అందరూ పళ్లికిలించి కారెక్కేసారు. కారు మెయిన్ రోడ్డెక్కేసింది.

"ఏమైంది నాన్నా? నచ్చలేదా?"

"పెళ్లికి ఒకే అంది కానీ..."

"కానీ...?" "పిల్లలని మటుకు కనను అని కచ్చితంగా చెప్పింది"

....

ఉపనిషత్తు 'అర్థోవా ఏష ఆత్మన్ యత్ పత్నీ" అంటుంది. పత్ని ఆత్మలోని సగ భాగం. భాగవతంలోని దశమ స్కంధంలో బలరామకృష్ణులు దేవకీ వసుదేవులతో "చిన్న పిల్లలు పడుతూ లేస్తూ తల్లిదండ్రుల ఒడిలోకి చేరుతూ ఉండేటప్పటి ఆనందం అల్పతతుల్యం. మాకు ఆ ఆనందం దక్కలేదు. మానవ మాత్రులం కాకపోవటం వల్ల ఆ క్షణాలకు మేం నోచుకోలేదు!" అంటారు వేదం సాఫల్యం యజ్ఞంలో ఉంటుంది. వివాహం సాఫల్యం సంతానంలోనన్నది శాస్త్రం! జీవితాన్ని కేవలం శారీరక సౌఖ్యం, విషయ లోలత్వం అనేవాటికి పరిమితం చేయాలనుకోవటం భారతీయ జీవిత విధానం కాదు.

మనం ఎక్కడికి, ఏ దారిలో వెళుతున్నాం?

**- వేదాంతం శ్రీపతిశర్మ**



# వారఫలం

పాలకుర్తి సంతోష శర్మ, స్మార్త పండితులు
సుబ్బరాజు టవర్స్, 11-10-30/308
విజయపురి కాలనీ, కొత్తపేట
హైదరాబాద్. ఫోన్: 9494608133

## మేషం



మీ శక్తి సామర్థ్యాలకు గుర్తింపు లభిస్తుంది. ఉద్యోగులకు ఉన్నతాధికారం లభించే సూచనలు అధికంగా ఉన్నాయి. ధార్మిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. ప్రభుత్వ సంబంధమైన పనులు వారాంతంలో పూర్తవుతాయి. క్రయ-విక్రయాలు అంతంత మాత్రంగా వుంటాయి. రుణాలు చేయాల్సి వస్తుంది. ప్రముఖులను సందర్శిస్తారు.

## వృషభం



ప్రతికూలతలున్నా పనులు పూర్తి చేస్తారు. దూర ప్రాంత ప్రయాణ సూచనలున్నాయి. స్త్రీల వల్ల సమస్యలు వచ్చే అవకాశాలున్నాయి. వ్యాపారులకు శ్రమ అధికం. రుణాలు తీరుస్తారు. వృత్తి ఉద్యోగాల్లో ఉన్నవారికి ఆర్థికంగా బాగుంటుంది. అనుకోని సంఘటనలు జరిగినా ధైర్యంతో ఎదుర్కొంటారు. ఆరోగ్య సలహాలు పాటించండి.

## మిథునం



ఆర్థికంగా అంతంత మాత్రంగా ఉంటుంది. వృత్తి వ్యాపారులకు బాగుంటుంది. ప్రయత్నాలు ఫలిస్తాయి. దేశ సంచారం చేస్తారు. చిరు వ్యాపారులకు లాభాలుంటాయి. రుణాలు తీర్చి ఊరట పొందుతారు. పేరు ప్రతిష్ఠలు లభిస్తాయి. వారాంతంలో ఆకస్మిక ధన లాభ సూచనలున్నాయి. ఉద్యోగులకు ఉన్నతాధికారం లభించే సూచనలు అధికంగా ఉన్నాయి.

## కర్కాటం



వాహన యోగం. దంపతుల మధ్య మనస్పర్థలు తొలగిపోతాయి. నిరుద్యోగులకు ఎదురు చూస్తున్న ఉద్యోగం లభిస్తుంది. ఆర్థిక ఇబ్బందులను అధిగమిస్తారు. ఆరోగ్య సమస్యలను నిర్లక్ష్యం చేయడం ఏమాత్రం మంచిది కాదు. వ్యతిరేకతలు ఎదురైనా ప్రారంభించిన పనులు పూర్తి చేస్తారు. ప్రముఖులను సందర్శిస్తారు. ఆలోచనల్లో స్థిరత్వం ఏర్పడుతుంది.

## సింహం



క్రయ-విక్రయాలు లాభదాయకంగా సాగుతాయి. కీర్తి ప్రతిష్ఠలు లభిస్తాయి. అనుకోని వార్తలు వింటారు. ఆర్థికంగా అంతంత మాత్రంగా ఉంటుంది. ముఖ్యమైన పనులు పూర్తి చేస్తారు. ధార్మిక కార్యక్రమాల్లో పాల్గొంటారు. విద్యార్థులు అధిక శ్రమ చేయాల్సి వస్తుంది. శుభ కార్యాల్లో అధిక ధనం ఖర్చు చేస్తారు. ఉద్యోగాభివృద్ధి సంతృప్తికరంగా ఉంటుంది.

## కన్య



ప్రతికూలతలు ఎదురైనా పనులు సకాలంలో పూర్తి చేస్తారు. తీర్థ యాత్రలు చేస్తారు. ఆర్థికంగా బాగుంటుంది. ఆలోచనల్లో స్థిరత్వం లోపిస్తుంది. ఉద్యోగులకు పదోన్నతి లభించే సూచనలు అధికం. కోర్టు విషయాలు సానుకూలంగా ఉంటాయి. బంధు, మిత్రులతో ఉత్సాహంగా గడుపుతారు. అదనపు ఆదాయ మార్గాలకై అన్వేషిస్తారు.

## తుల



గృహ సౌఖ్యం. ఆరోగ్య సమస్యలు తీరి ప్రశాంతత లభిస్తుంది. వివాదాలకు దూరంగా వుంటే మంచిది. వృత్తి వ్యాపారస్తులకు ఆర్థికంగా ఆశించిన ఫలితాలు లభిస్తాయి. విందు-వినోదాల్లో పాల్గొంటారు. తీర్థ యాత్రలు చేస్తారు. రుణాలు తీరుస్తారు. ధార్మిక కార్యక్రమాలు నిర్వహిస్తారు. ముఖ్యమైన పనులు వారాంతంలో పూర్తి చేస్తారు. ఎదురు చూస్తున్న శుభ సమాచారం అందుకుంటారు.

## వృశ్చికం



సంయమనంతో వ్యవహరించడం చెప్పదగిన సూచన. శత్రుబాధలు తీరి ప్రశాంతత ఏర్పడుతుంది. బంధు, మిత్రులతో మనస్పర్థలకు ఆస్కారం. కోర్టు వ్యవహారాలు సానుకూలంగా ఉంటాయి. దీర్ఘకాలిక సమస్యలకు పరిష్కారం లభిస్తుంది. స్త్రీలకు సమస్యలుంటాయి. ఆర్థికంగా బాగుంటుంది. ఉద్యోగాభివృద్ధి సంతృప్తికరంగా ఉంటుంది. శారీరక/మానసిక శ్రమ అధికమైనా అనుకున్న పనులు సకాలంలో పూర్తి చేస్తారు.

## ధనుస్సు



శుభ కార్యాల్లో పాల్గొంటారు. ఆర్థికంగా ఆశించిన రీతిలో ఉండకపోవచ్చు. క్రయ-విక్రయాలు బాగుంటాయి. వృత్తి వ్యాపారులకు బాగుంటుంది. ఉద్యోగులకు పదోన్నతి లభిస్తుంది. వృథా ఖర్చులు అధికంగా ఉంటాయి. విలువైన వస్తువులు సమకూర్చుకుంటారు. అన్ని వ్యవహారాల్లో మీదే పై చేయిగా ఉంటుంది. కుటుంబంలో మనస్పర్థలకు అవకాశాలున్నాయి, సహనంతో మెలగడం మంచిది.

## మకరం



వ్యాపారులకు యథాతథంగా ఉంటుంది. కుటుంబ సమస్యలు తీరుతాయి. బంధు, మిత్రులతో వివాదాలకు దూరంగా ఉండడం చెప్పదగిన సూచన. ఆకస్మిక ధన లాభ సూచనలున్నాయి. వ్యాపారులకు వారాంతంలో రుణాలు మంజూరవుతాయి. వృత్తి ఉద్యోగాల్లో ఉన్నవారికి ఆశించిన ఫలితాలు ఉంటాయి. కోర్టు వ్యవహారాలు సానుకూలం. ఉద్యోగులకు ఉన్నతాధికారుల ప్రశంసలు లభిస్తాయి.

## కుంభం



వివాదాలకు దూరంగా ఉంటే మంచిది. అకారణంగా ఆందోళనకు లోనవుతారు. బంధు, మిత్రులతో మనస్పర్థలకు అవకాశం. విద్యార్థులు పరీక్షల్లో విజయం సాధిస్తారు. కుటుంబ గౌరవం పెంపొందుతుంది. దూర ప్రాంత ప్రయాణ సూచనలున్నాయి. సమస్యలు తీరి ప్రశాంతత లభిస్తుంది. వృత్తి వ్యాపారస్తులకు బాగుంటుంది. కీర్తి ప్రతిష్ఠలు లభిస్తాయి.

## మీనం



కుటుంబ సభ్యులతో ఉత్సాహంగా గడుపుతారు. భాగస్వామ్య వ్యాపారులు సమస్యలు పరిష్కరించుకుంటారు. ధార్మిక కార్యక్రమాల్లో పాల్గొంటారు. చిరు వ్యాపారులకు పోటీ ఎదురైనా ఎవరి లాభాలు వారికి ఉంటాయి. వారాంతంలో రుణాలు తీరుస్తారు. ప్రతికూలతలు ఎదురైనా ముఖ్యమైన పనులు పూర్తి చేస్తారు. వృద్ధుల ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహిస్తారు. విద్యార్థులు పోటీ పరీక్షల్లో విజయం సాధిస్తారు.

# జలవాస్తు-ఫలితాలు


వాస్తువార్త
వాస్తు విద్వాన్ సాయిశ్రీ
డా॥ దంతూరి పండరినాథ్
3-2-4, కింగ్స్‌వే, సికింద్రాబాద్
సెల్: 9885446501/9885449458





## ఇంటి ఆవరణలోకి నీరు

ఇతరుల ఇంటిలో నుండి ప్రవహించే నీరు తమ ఇంటి ఆవరణలో పారినప్పుడు ఆ ఇంట్లో నివసించేవారికి అనేక కష్టనష్టాలు సంభవించే అవకాశముంది. ఇతరుల ఇంటి నుండి వచ్చే నీరు ఏ దిక్కు నుండి తమ ఆవరణలో ప్రవేశించినా ఈ చెడు ఫలితాలలో పెద్దగా మార్పు వుండదు.


## Water flow to premises

In a neighborhood if water tends to flow(from any angle) from one house to another, the recipient might face problems such as miseries and losses.



## గృహావరణం-ఈశాన్య నీటి ప్రవాహం

తమ గృహావరణలో నీరు ఈశాన్య దిశకు ప్రవహించి ఈశాన్య తూముల ద్వారా బయటకు వెళ్లినట్లయితే, ధన, కనక వస్తు వాహనాదులు సమకూరే సత్ఫలితాలు కలుగుతాయి.



## North-East-Premises Waterflow

If the water flow from your premises moves towards North-East and drains out by North-East outlets the dweller will gain gold, vehicles and property.

## గృహావరణం-ఉత్తర నీటి ప్రవాహం

ఇంటి ఆవరణలోని నీరు ఉత్తర దిశగా ప్రవహించి, ఈశాన్య, ఉత్తర తూముల ద్వారా బయటకు పారినట్లయితే ధన ధాన్య లాభం, బంధువులతో సఖ్యత మొదలైన సత్ఫలితాలు పొందవచ్చు.

## North-Premises Waterflow

If the water flow from your premises moves towards North and drains out by North outlets the dweller will gain gold, vehicles and property.




## గృహావరణం-వాయవ్య నీటి ప్రవాహం

ఇంటి ఆవరణలోని నీరు వాయవ్య దిక్కుకు, పశ్చిమ వాయవ్యం లేదా ఉత్తర వాయవ్యం ప్రవహించి, పశ్చిమ వాయవ్య లేదా ఉత్తర వాయవ్య తూముల ద్వారా బయటకు పారినట్లయితే పశునష్టం జరిగే ప్రమాదముంది.

## North-West-Premises Waterflow

If the water flow from your premises moves towards North-West and drains out by North-West Outlets the dweller will bring prosperity and lead a happy life.



## గృహావరణం-పడమర నీటి ప్రవాహం

ఇంటి ఆవరణలోని నీరు పడమర దిశకు పారి పడమర తూముల ద్వారా బయటకు వెళ్లినట్లయితే వ్యవహారాలలో వరుసగా ఆటంకాలు, నష్టాలు ఏర్పడి దారిద్ర్యం పొందవలసి వస్తుంది.

## West-Premises Waterflow

If the water flow from your premises moves towards West and drains out by West outlets the dweller might face problems such as miseries and losses.



చిన్న కథ

# బిత్తరపోయిన యం.డి.

అదొక స్పిన్నింగ్ మిల్లు.

ఆ మిల్లులో పనిని ఎక్కువగా కాంట్రాక్టు లేబర్ దగ్గరే చేయిస్తుంటారు. వారి పనిని పర్యవేక్షించడానికో సూపుర్‌వైజర్ వుంటాడు. వారి దగ్గర చేయించిన పనిని సూపర్‌వైజర్ మేనేజర్‌కి ఏ రోజు జరిగిన పనిని ఆ రోజు సాయంకాలం అప్‌డేట్ చేస్తుంటాడు.

ఓ శుభ ముహూర్తాన ఓ కాంట్రాక్టు లేబర్ యం.డి. క్యాబిన్‌లోకి వెళ్లి ముఖానికి కాస్తంత నవ్వుని పులుముకొని "సార్, నా పెళ్లికి మీరు తప్పకుండా రావాలి సార్" అన్నాడు, తన శుభలేఖని యం.డి. గారికిస్తూ..

యం.డి. శుభలేఖని తీసుకుని "పెళ్లెప్పుడు?" అడిగాడు.

"మార్చిలో సార్"

"మన ఔట్ స్టాండింగ్ బ్యాలెన్స్ అమౌంట్ అంతా రికవరీ అయ్యేదెప్పుడు?"

"మార్చిలో సార్"

"రికవరీ కావాల్సిన మన ఔట్ స్టాండింగ్ బ్యాలెన్స్ ఎంతుంది?"

"నలభై లక్షలు" చెప్పాడు కాంట్రాక్టు లేబర్.

"ఏమయ్యా, నలభై లక్షల రూపాయలు ఔట్ స్టాండింగ్‌లో పెట్టుకుని మార్చి నెలలో నీకెలా పెళ్లి చేసుకోవాలని అనిపించిందయ్యా! ఏడుపు ముఖం పెట్టి–

"ఇప్పుడు నువ్వు పెళ్లి చేసుకోవడానికి వెడితే ఈ ఔట్ స్టాండింగ్ కలెక్షన్ అయ్యేది వచ్చే మార్చికేగా! నీకేం? నువ్వు హాయిగా పెళ్లి చేసుకుని పెళ్లాంతో చెట్టాపట్టాలేసుకుని సినిమాలకు, షికార్లకు తిరుగుతుంటావు. ఎటొచ్చీ కలెక్షన్స్ రాక బాధపడేది నేనే కదా!

పెళ్లి చేసుకున్న ఆనందంలో నువ్వు, కలెక్షన్ వసూలు కాక బాధలో నేను.

సరే వెళ్లు" అని ఓ నిట్టూర్పు విడిచాడు యం.డి. అతడి వైపు చూస్తూ.

........

మరుసటి రోజు మెయింటెనెన్స్ విభాగంలో పని చేస్తున్న వర్కర్ సూపర్‌వైజర్‌తో "అన్నా మన యం.డి గారు ఏ మూడ్‌లో ఉన్నారు?" అని అడిగాడు.

"ఆయన మూడ్‌తో నీకేం పని?"

"అడ్వాన్స్ అడుగుదామని..." అర్థోక్తిలో ఆగాడు.

"యం.డిగారు మంచి మూడ్‌లోనే ఉన్నారు. వెళ్లి నువ్వు అడగాలనుకున్న అడ్వాన్స్ అడుగు".

వర్కరు యం.డి. క్యాబిన్‌లోకి వెళ్లి నమస్కారం పెట్టి–

"సార్! మా ఆవిడ కడుపుతో ఉంది" అని అన్నాడు.

"మీ ఆవిడ కడుపుతో వుంటే నన్నేం చెయ్యమంటావురా?" అడిగాడు యం.డి.

"నాకు అడ్వాన్స్‌గా డబ్బులు కావాలి సార్, మా ఆవిడ్ని హాస్పిటల్‌కి తీసుకెళ్లాలి".

"ఎంత కావాలి?"

"నాలుగు వేల రూపాయలు"

"మన కంపెనీలో ఆ మూలనున్న మూడు మిషన్లు పని చేస్తున్నాయా?" అడిగాడు యం.డి.

"లేదు సార్!"

"ఆ మూడు మిషన్లు అమ్మి నీకు కావాల్సిన డబ్బులు తీసుకుని మిగిలిన డబ్బులు క్యాషియర్ దగ్గర ఇచ్చేయ్" అని అన్నాడు.

ఆ మాటలు విన్న వర్కర్ దిక్కు తోచని అయోమయ స్థితిలో సూపర్‌వైజర్ దగ్గరకొచ్చి యం.డి.తో జరిగిన సంభాషణ ఏకరువు పెట్టాడు.

సూపర్‌వైజర్‌తో "యం.డి. మూడు మిషన్లు అమ్మి డబ్బులు తీసుకోమన్నాడు కదా! మిషన్లు అమ్ముతున్నట్లుగా పేపరు ప్రకటన ఇచ్చేయ్"


"పేపరు ప్రకటన ఇవ్వడానికి ఎంత ఖర్చువుతుందన్నా?"

"దానికయ్యే ఖర్చు నేను భరిస్తాన్లే" అని పేపరు ప్రకటన ఇచ్చాడు సదరు సూపర్‌వైజర్.

మరునాడు ఆ పేపర్ ప్రకటన చూసి ఆ మిషన్లను కొనడానికి మిల్లుముందు బారులు తీరారు కొనుగోలుదారులు.

కంపెనీ బయట క్యూలో వున్న వాళ్లను చూసి బిత్తరపోయాడు యం.డి.

**- సి.హెచ్.నాగార్జున శర్మ**








## సరదా రచనలకు ఆహ్వానం

జోక్స్, ప్యారడీ పాటలు, సరదా అనుభవాలు,
పంచ్ డైలాగులు వగైరాలు
పంపితే పరిశీలించి, బాగుంటే ప్రచురిస్తాం.
దయచేసి కాపీ రచనలు పంపకండి.
మీ రచనలు పంపించవలసిన చిరునామా:
నవ్వుల్.. రువ్వుల్, ఎడిటర్, ఆదివారం వార్త, నం.396,
లోయర్ ట్యాంక్‌బండ్, హైదరాబాద్-500 080.
sunmagvaartha@gmail.com

# ఈ వారం కా'ర్టూన్స్'


బాగా తన్నుకున్నాక... భార్య భర్తకు సారీ చెప్పే అద్భుత కొటేషన్ ఒకటి ఫేస్బుక్ లో దొరికిందండీ..! అదిపుడు మీకు పంపిస్తాను.. !!
Zakir...


తమ్ముడూ.. నీవ్వూ వచ్చేయి..!
Zakir...


ఉండు.. స్నాక్స్ తెస్తాను.. ఇలా బస్సెక్కి ఊరంతా చూస్తూ కబుర్లు చెప్పుకుందాం..!!
Zakir...



వియత్నాంలోని 'బాన్ గోయిక్' జలపాత చిత్రాలివి. వియత్నాం, చైనా సరిహద్దులో ఉన్న ఈ జలపాతం ఆసియా నయాగరాగా పేరు గాంచింది. పడవల్లో జలపాతం దగ్గరికి వెళ్లవచ్చు. వియత్నాం రాజధాని హనాయికి సుమారు మూడు వందల కిలోమీటర్ల దూరంలో ఉందీ జలపాతం.



